PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 151 | విజయవాడ, గురువారం 2 జనవరి 2025 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 2 January 2025 | Rs



ఉండవల్లిలో సిఎం అధికారిక నివాసం

- ఉత్తర్వులు విడుదల

2



2025లో టీమిండియా బిజీ.. బిజీ..

- ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు ఇంగ్లండ్‌తో సిరీస్

6



## అదానీకి స్టాలిన్ సర్కార్ భారీ షాక్

- స్మార్ట్ మీటర్ల టెండర్లు రద్దు

**చెన్నై :** నరేంద్ర మోడీ ప్రభుత్వ అండతో ప్రపంచ అపర కుబేరుల్లో ఒకడిగా ఎదిగిన గౌతం అదానీ ముడుపుల భాగోతం నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం ఆయనకు ఊహించని షాక్ ఇచ్చింది. అదానీ విద్యుత్ ప్రాజెక్టులు అవినీతికి నెలవుగా మారడంతో ఇప్పటికే ఖరారైన ఆ కంపెనీ స్మార్ట్ మీటర్ల టెండర్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. అదానీ గ్రూపునకు చెందిన అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ లిమిటెడ్ (ఎఇఎస్ఎల్) కోట్ చేసిన ధర చాలా ఎక్కువని, ఆ ధర ఆమోదయోగ్యం కాదంటూ వాటిని రద్దు చేయాలని తమిళనాడు పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ (టాన్‌జెడ్ కో) కోరింది. దీంతో ఆ టెండర్లను రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి మరోమారు టెండర్లు ఆహ్వానిస్తామని తెలిపింది.

సోలార్ పవర్ కాంట్రాక్టులు, విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాల విషయంలో అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీపై 2024 మార్చిలో అమెరికాలో రూ.2,300 కోట్ల అవినీతి ఆరోపణలు వచ్చినా కేంద్ర ప్రభుత్వం ఇంతవరకు దీనిపై ఎలాంటి విచారణ జరిపించలేదు. జెపిసి విచారణకు ప్రతిపక్షాలు పట్టుబట్టినా ఫలితం లేకపోయింది. భారత్‌లో ఇంధన ప్రాజెక్టుల ఏర్పాటు విషయంలో అనుకూలంగా వ్యవహరించేలా అదానీ గ్రూప్ లేదా గౌతం అదానీ సహా కొందరు వ్యక్తులు లంచం ఇవ్వజూపారనే ఆరోపణలపై న్యూయార్క్‌లోని యుఎస్ అటార్నీ జనరల్ ఆఫీస్, జస్టిస్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఫ్రాడ్ యూనిట్ విచారణ ప్రారంభించింది.

చెన్నయ్ సహా తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టుతో పాటు ఎనిమిది జిల్లాల్లో ప్యాకేజీ–1లో భాగంగా 82 లక్షల స్మార్ట్ మీటర్ల కొనుగోలుకు టెండర్లు పిలిచింది. సెంటర్ ఫండెడ్ రివాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ (ఆర్‌డిఎస్ఎస్) పథకం కింద స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయాలనుకుంది. ఇందుకోసం 2023 ఆగస్టులో టెండర్లు ఆహ్వానించగా.. ఎఇఎస్ఎల్ తక్కువ ధరతో టెండరు వేసింది. అదానీ కంపెనీకి ఈ టెండర్ దక్కింది. అయినప్పటికీ ఆ ఆఫర్ ధర ఎక్కువేనని.. ప్రభుత్వ ఖజానాపై భారం పడుతుందని స్టాలిన్ ప్రభుత్వం భావించినట్లు తెలుస్తోంది. దీంతో ఈ టెండర్‌ను రద్దు చేస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# సెకి 'అవినీతి'పై ముందుకెళ్లలేం

## నివేదిక లేకుండా చర్యలు తీసుకోలేం

- సాధ్యాసాధ్యాలను బట్టి సూపర్‌సిక్స్ అమలు
- మీడియాతో ఇష్టాగోష్టిలో సిఎం చంద్రబాబు నాయుడు



విజయవాడలోని దుర్గమ్మ ఆలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న అధికారులు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

గత ప్రభుత్వ హయాంలో సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సెకి)లో చోటు చేసుకున్న అవినీతిపై ఎటువంటి నివేదిక లేకుండా ముందుకెళ్లలేమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఈ సందర్భంగా విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన జవాబులిచ్చారు. సెకి ఒప్పందంలో జరిగిన అవినీతిపై రాష్ట్రప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే అభిప్రాయం ప్రజలతో పాటు టిడిపి నాయకుల్లో కూడా ఉందన్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకురావడంతో స్పందిస్తూ ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలంటే భారీ మొత్తంలో పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. అవినీతి జరిగిందనే కారణం చూపించి ఒప్పందం రద్దు చేసుకునే అవకాశం ఉంది కదా అన్న ప్రశ్నకు ఆయన 'అవినీతి జరిగిందని అమెరికా న్యాయశాఖ నుంచి నివేదిక రావాలి కదా? అటువంటిదేమి రాలేదు. నివేదిక లేకుండా ముందుకు వెళ్లి చర్యలు తీసుకోలేం.'అని స్పష్టం చేశారు. వైసిపి ప్రభుత్వ హయంలో సెకితో ఒప్పందం కుదుర్చుకున్నందుకుగానూ అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ రూ.1,750కోట్ల లంచం ఇచ్చారని అమెరికా న్యాయశాఖ ఫెడరల్ ప్రాసిక్యూటర్లు బహిర్గతం చేయడంతో దీనిపై ఏం చేయాలో ఆలోచిస్తామని అప్పట్లో అసెంబ్లీలో చంద్రబాబునాయుడు ప్రకటన చేసిన విషయం తెలిసిందే. అయితే, కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి అదానికి ఉన్న సంబంధాల నేపథ్యంలో ముఖ్యమంత్రి ప్రకటనపై అప్పట్లోనే సందేహాలు వ్యక్తమైనాయి. ఈ నేపథ్యంలో తాజాగా 'నివేదిక లేకుండా సెకి అవినీతిపై ముందుకెళ్లలేం' అని సిఎం తేల్చి చెప్పడం గమనార్హం. ప్రజలపై విద్యుత్ భారాలు అధికంగా ఉన్నాయని, ప్రతి నెల వసూలు చేసే 40 పైసల ఎఫ్‌పిపిసిఎ చార్జీల నుంచి వారికి మినహాయింపు ఇచ్చే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుందా అన్న ప్రశ్నకు విద్యుత్ రంగంలో రూ.1,20,200 కోట్లు అప్పులు ఉన్నాయని చంద్రబాబు చెప్పారు. గత ప్రభుత్వ పాపాలను మోసి తమను మునిగిపొమ్మంటే సాధ్యం కాదని చెప్పారు. కేంద్రప్రభుత్వం నిధులు ఇస్తున్నా సూర్యఘర్, కుసుమ్ పథకాలను గత ప్రభుత్వం ఉపయోగించలేదని అన్నారు. పిపిఎల ద్వారా ప్రైవేట్ కంపెనీలతో కుదుర్చుకున్న విద్యుత్‌ను తీసుకోకుండా ఆపరేషన్ కాస్ట్ రూ.9వేల కోట్లు గత ప్రభుత్వం చెల్లింపులు చేసిందని తెలిపారు. గత మిగతా 3లో

## దావోస్ పర్యటనకు సిఎం

- 20 నుంచి వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సుకు హాజరు

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దావోస్ పర్యటన ఖరారైంది. ఈ నెల 20వ తేదీ నుంచి 24వ తేదీ వరకూ ఐదు రోజులపాటు అక్కడ పర్యటించనున్నారు. దీనికోసం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చంద్రబాబు ఈ సమావేశాలకు హాజరయ్యేవారు. అక్కడే పెట్టుబడులు, ఇతర అంశాలపై చర్చలు జరిగాయి. గతంలో అమరావతి పెవిలియన్ కూడా ఏర్పాటు చేశారు. సుమారు రూ.13 లక్షల కోట్ల వరకూ పెట్టుబడులకు ఒప్పందాలూ జరిగాయి. ప్రస్తుత పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు ఐటి, మానవ వనరులశాఖ మంత్రి నారా లోకేష్, పరిశ్రమలశాఖ మంత్రి టిజి భరత్ కూడా సమావేశాలకు వెళ్లనున్నారు. అలాగే ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి కార్తికేయ మిశ్ర, ప్రైవేటు సెక్రటరీ కపర్తి రవికృష్ణ, సెక్యూరిటీ అధికారి బండారు శ్రీనాథ్, సిఎం వైద్యాధికారి ఎమ్‌డి అజహరుద్దీన్ ఈ బృందంలో సభ్యులుగా ఉన్నారు. పర్యటనకు సంబంధించిన ఖర్చును రాష్ట్ర ఎకనామిక్ బోర్డు కింద చెల్లించనున్నారు. ఈ మేరకు జిఓ విడుదలైంది.

# మిర్చి ధర పతనం

- కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకున్నా పెరగని రేటు
- కొత్త సరుకు వచ్చినా కదలని పాత నిల్వలు
- దిక్కుతోచని స్థితిలో రైతులు



**ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి**

గుంటూరు మార్కెట్ యార్డులో మిర్చి ధరలు అంతకంతకూ పడిపోతున్నాయి. ఈ ఏడాది సీజన్ ప్రారంభమైనా పాత నిల్వలు కదలడం లేదు. కొత్త సరుకుకు ధర పలకడం లేదు. మరోవైపు కోల్డ్ స్టోరేజీల్లో నిల్వలు పేరుకుపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ఇతర దేశాలకు ఎగుమతి ఆర్డర్లు తగ్గాయని, ఇతర రాష్ట్రాల్లో కూడా మిర్చి సాగు పెరిగిందని చెబుతూ గత కొంతకాలంగా మిర్చి ధరలను వ్యాపారులు దిగ్గోస్తున్నారు. గతేడాది కన్నా ఈ ఏడాది ధరలు మరింత తగ్గాయి. 20 రోజుల నుంచి కొత్త సరుకు గుంటూరు యార్డుకు వస్తోంది. ప్రధానంగా తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన కొన్ని ప్రాంతాలతోపాటు రాయలసీమ నుంచి బుధవారం 40 వేల టిక్కిలు యార్డుకు వచ్చాయి. అన్ని రకాల మిర్చి సగటు కనిష్ట ధర రూ.7,500 మాత్రమే ఉంది. గరిష్ట ధర మేలు రకాలకు రూ.16,500, సాధారణ రకాలకు రూ.14,500కు మించలేదు. గతేడాది ఇదే రోజుల్లో క్వింటాలుకు సగటు కనిష్ట ధర రూ.12 వేలు, గరిష్ట ధర రూ.20 వేల వరకు పలికింది. ప్రస్తుతం క్వింటాలుకు అన్ని రకాల ధర రూ.4 వేల నుంచి ఐదు వేల వరకు తగ్గింది. పేరెన్నికైన స్పెషల్ వెరయిటీలు తేజ, బాడిగ ధరలు కూడా భారీగా తగ్గాయి. తేజ కనిష్ట ధర రూ.7,500, గరిష్ట ధర రూ.16,500 ఉంది. బాడిగ కనిష్ట ధర రూ.7,500, గరిష్ట ధర రూ.13,500 లభించింది. దేవనారు డీలక్స్ కనిష్ట ధర రూ.8,500, గరిష్టం ధర రూ.15 వేలు వచ్చింది. కోల్డ్ స్టోరేజిల్లో నిల్వ చేసుకున్న ఎసి కామన్ వెరైటీలకు క్వింటాలుకు సగటు కనిష్ట ధర రూ.7,500 వేలు, గరిష్ట ధర రూ.13,500 మాత్రమే లభించింది. స్పెషల్ వెరైటీలు తేజకు కనిష్ట ధర రూ.8 వేలు, గరిష్ట ధర రూ.16,500 వచ్చింది. గతేడాది సీజన్ ముమ్మరంగా సాగుతున్న తరుణంలో మార్చి తర్వాత ధరలు బాగా తగ్గడంతో భవిష్యత్తులో మంచి ధరలు వస్తాయని ఆశించి రైతులు కోల్డ్ స్టోరేజిల్లో నిల్వ చేసుకున్నారు. ఇప్పటికే కోల్ట్ స్టోరేజీల్లో దాదాపు 18 లక్షల వరకు నిల్వలు ఉన్నట్టు అధికారులు తెలిపారు. కొత్త సరుకుకు ధర రావడం లేదని, పాత నిల్వలను అయినకాడికి అమ్ముకోక తప్పడం లేదని రైతులు వాపోతున్నారు.



## యుపిఐ లావాదేవీల రికార్డ్

- డిసెంబర్‌లో 1673 కోట్లుగా నమోదు
- 2024లో 46 శాతం వృద్ధి

2

విశాఖ స్టీల్ ఊపిరి తీసి...

## మిట్టల్‌కు ఊడిగమా?

- 'ఉక్కు' ఉద్యోగులకు 4 నెలలుగా జీతాల్లేవు..
- ఏర్పాటు కాని మిట్టల్ ఉద్యోగుల జీతాలపై కసరత్తా?

# ఎరువు సబ్సిడీ పెంపు

## ఫసల్ బీమా యోజన పొడిగింపు

## కేంద్ర మంత్రి వర్గం నిర్ణయాలు

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ రైతులు ఒక వైపు పోరాడుతుంటే, వారి ప్రధాన డిమాండ్‌ను పట్టించుకోకుండా డిఎపి ఎరువుపై సబ్సిడీ పెంపు, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పిఎంఎఫ్‌బివై) పథకం పొడిగింపు వంటి కంటి తుడుపు నిర్ణయాలకే కేంద్ర మంత్రివర్గం పరిమితమైంది. బుధవారం ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో దల్లేవాల్ నిరవధిక నిరాహార దీక్షను విరమింపజేసేందుకు రైతులతో చర్చలు జరపాలన్న డిమాండ్ ప్రస్తావనకు వస్తుందని ఆశించినవారికి నిరాశే మిగిల్చింది. మంత్రివర్గ సమావేశం అనంతరం కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ విలేకరులతో మాట్లాడుతూ, 2025లో తొలి క్యాబినెట్ భేటీని ప్రధాని నరేంద్ర మోడీ రైతులకు అంకితం చేశార న్నారు. ఇకపై 50 కిలోల డిఎపి బస్తా రూ.1350 కే లభిస్తుందని, కేంద్రం తాజాగా తీసుకున్న ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా నాలుగు కోట్ల మంది రైతులకు లబ్ధి చూకూరనుందని తెలిపారు. సబ్సిడీ ఇచ్చేందుకు అదనంగా రూ.3,850 కోట్లు కేటాయించి నట్లు తెలిపారు. అదేవిధంగా, పిఎంఎఫ్‌బివై పథకాన్ని పొడిగించేందుకు కేంద్ర మంత్రి వర్గం నిర్ణయం తీసుకుందన్నారు. ఈ పథకానికి రూ. 69,515 కోట్లు కేటాయించామన్నారు.


అలాగే ఫండ్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ (ఎఫ్ఐఎటి)కి రూ. 824.77 కోట్ల కేటాయించినట్లు పేర్కొన్నారు. సాంకేతికతను ఉపయోగించి త్వరితగతిన రైతుల పంటలకు పంట బీమా చెల్లింపు విధానానికి ఫండ్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ తోడ్పడనుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు.

**క్యాబినెట్ నిర్ణయాలపై ప్రధాని మోడీ ట్వీట్**

బుధవారం జరిగిన క్యాబినెట్ నిర్ణయాలపై ప్రధాని నరేంద్ర మోడీ'ఎక్స్'లో పోస్టు పెడుతూ, రైతుల సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉన్న ప్రభుత్వం మాది. దేశానికి అన్నం పెట్టేందుకు శ్రమించే మన రైతులు గర్వకారణం. 2025 మొదటి క్యాబినెట్ భేటీని రైతుల శ్రేయస్సు కోసం అంకితం చేశాం. వారి విషయంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నందుకు ఆనందంగా ఉంది" అని పేర్కొన్నారు.

## నూతన సంవత్సర వేడుకల వేళ అమెరికాలో ఘోరం

- ట్రక్కుతో దాడి... ఆ పై కాల్పులు
- 10 మంది మృతి, 30మందికి పైగా గాయాలు
- ఇది ఉగ్రవాద దాడేనన్న మేయర్



న్యూ ఆర్లీన్స్‌లో విధ్వంసానికి కారణమైన ట్రక్కు

**న్యూ ఆర్లీన్స్ :** నూతన సంవత్సర వేడుకల వేళ అమెరికాలో ఘోరం చోటు చేసుకుంది. కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ న్యూ ఆర్లీన్స్‌లోని కెనాల్, బోర్బన్ వీధిలో వేడుకలు జరుపుకుంటున్న జనంపైకి ఓ దుండగుడు వేగంగా ట్రక్కును పోనిచ్చాడు. . ఈ దాడిలో 10మంది మృతి చెందగా 30మంది వరకు గాయపడ్డారని అధికారులు తెలిపారు. వీలైనంత ఎంత మందిని తొక్కించేందుకు యత్నించాడు. ఆ పై కాల్పులు కూడా జరిపాడని అధికారులు తెలిపారు. ఆ ట్రక్కుల్లో పేలుడు పదార్థాలు కూడా ఉన్నట్లు వార్తలొచ్చాయి బుధవారం తెల్లవారు జాము 3.15 గంటల ప్రాంతంలో ఈ దాడి జరిగినట్లు . ఆర్లీన్స్ పోలీస్ సూపరింటెండెంట్ కిర్క్ పాట్రిక్ బుధవారం ఉదయం మీడియాకు తెలిపారు. ట్రక్కు దాడితో భీతావహులైన జనం అటు ఇటు పరుగులు తీశారు. ఇది ఉగ్రవాద దాడేనని న్యూ ఆర్లీన్స్ నగర మేయర్ పేర్కొన్నారు. రద్దీగా ఉండే చారిత్రిక ఫ్రెంచ్ క్వార్టర్ వద్ద కాలేజీ ఫుట్‌బాల్ ఫైనల్ కొద్ది గంటల్లో ప్రారంభం కావాల్సి వుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు జరిపిన కాల్పుల్లో అనుమానితుడు చనిపోయాడు. దీనిని ఉగ్రవాద చర్యగానే పరిగణించి ఫెడరల్ బ్యూరో ఇన్విస్టిగేషన్ (ఎఫ్‌బిఐ) దర్యాప్తు ప్రారంభించింది. అమెరికాలో తుపాకీ సంస్కృతితో బాటు వాహనంతో తొక్కించి చంపడం వంటి నేరాలు పెరిగిపోతున్నాయి.

## జింబాబ్వేలో ఉరి శిక్ష రద్దు

**హరారె :** ఉరి శిక్షను జింబాబ్వే రద్దు చేసింది. దాదాపు 20 ఏళ్ళ క్రితం చివరిసారిగా దేశంలో మరణశిక్షను అమలు చేశారు. ఉరిశిక్షను రద్దు చేస్తూ పార్లమెంట్‌లో బిల్లును ఆమోదించిన తర్వాత ఈ వారంలో అధ్యక్షుడు ఎమ్మర్సన్ మంగగ్వా ఆమోద ముద్ర లభించింది. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న సమయంలో 1960ల్లో అధ్యక్షుడు కూడా మరణ శిక్షను ఎదుర్కొనాల్సి వచ్చింది. ప్రస్తుతం దేశంలో 60మంది ఖైదీలు మరణశిక్షను ఎదుర్కొంటు న్నారు. ఈ కొత్త చట్టంతో వీరందరికీ మినహాయింపు లభిస్తుంది. 2005లో దేశంలో చివరిసారిగా మరణశిక్షను అమలు చేశారు. ఉరి శిక్ష అమలు బాధ్యతను ఎవరూ తీసుకోవడానికి సంసిద్ధంగా లేకపోవడంతో తర్వాత ఈ శిక్షలను అమలు చేయలేకపోయారు.ఉరి శిక్ష రద్దు ఉద్యమానికి ఇది ఎంతగానో దోహదపడు తుందని అమ్నెస్టీ ఇంటర్నేషనల్ వ్యాఖ్యానిం చింది. కెన్యా, లైబేరియా, ఘనా వంటి ఇతర ఆఫ్రికన్ దేశాలు కూడా ఇటీవల ఉరి శిక్ష రద్దుపై సానుకూల చర్యలు తీసుకున్నాయి, కానీ అవి ఇంకా అమలు రూపం ధరించలేదని మానవ హక్కుల గ్రూపు వ్యాఖ్యానించింది. ప్రస్తుతం ప్రపంచంలో మూడు వంతుల దేశాలు ఉరిశిక్షను అమలు చేస్తున్నాయి.

# పుస్తక మహోత్సవానికి సర్వం సిద్ధం

- నేటి నుంచి ఐజిఎంసి స్టేడియంలో
- ప్రారంభించనున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- 6న పుస్తక ప్రియుల పాదయాత్ర
- 12న ముగింపు సభ




ఐజిఎంసి స్టేడియం వద్ద ఏర్పాటు చేసిన పుస్తక మహోత్సవం బ్యానర్లు

**ప్రజాశక్తి- విజయవాడ అర్బన్**

విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో 35వ పుస్తక మహోత్సవానికి అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. మొదటిసారిగా విజయవాడ నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో పుస్తక మహోత్సవం జరగనుండడంతో సొసైటీ సభ్యులు శరవేగంగా విస్తృత ఏర్పాట్లు చేశారు. గురువారం సాయంత్రం ఆరు గంటలకు పుస్తక ప్రదర్శనను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రారంభించనున్నారు. ఈ నెల 12వ తేదీ వరకు పుస్తక ప్రదర్శన జరగనుంది. పుస్తక మహోత్సవ ప్రాంగణానికి సాహితీ నవ జీవన్ బుక్ లింక్స్ అధినేత పిడికిటి రామ కోటేశ్వరరావు, ప్రధాన సాహిత్య వేదికకు ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు పేరు పెట్టారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుండి తెలుగు, ఇంగ్లీష్., హిందీ ప్రచురణకర్తలు 150 మంది హాజరు రానున్నారు. వీరి కోసం 234 స్టాళ్లను ఏర్పాటు చేశారు. ప్రధానంగా తమిళనాడు,. కేరళతోపాటు ఢిల్లీ నుండి కూడా ఆంగ్ల ప్రచురణ సంస్థలు రానున్నాయి. ప్రతి రోజూ శత జయంతి కార్యక్రమాలు, సాహితీ కార్యక్రమాలతోపాటు, పుస్తకావిష్కరణ సభలు జరగనున్నాయి. ప్రతి రోజూ మధ్యాహ్నం మూడు గంటల నుండి రాత్రి పది గంటల వరకు కార్యక్రమాలు ఉంటాయి.

విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రతన్ టాటా ప్రతిభ వేదిక ఏర్పాటు చేశారు. దీనిపై ప్రతి రోజూ పాఠశాల విద్యార్థులకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తారు. పుస్తక విజ్ఞానం పెంపొందించుకోవాలని ఆకాంక్షిస్తూ ఈ నెల ఆరున పుస్తక ప్రియుల పాదయాత్ర నిర్వహించనున్నారు. నగరంలోని సిద్ధార్థ ఆడిటోరియం వద్ద ప్రారంభమై పుస్తక మహోత్సవం ప్రాంగణం వరకూ ఇది సాగనుంది. పాదయాత్రలో ప్రముఖ సాహితీవేత్తలు, కవులు, పుస్తక ప్రియులు, వివిధ పాఠశాలు, కళాశాలల విద్యార్థులు పాల్గొంటారు. 12వ తేదీ రాత్రి ఏడు గంటలకు ముగింపు సభ జరగనుంది.

**విస్తృత ఏర్పాట్లు : బుక్ ఫెస్టివల్ సొసైటీ**

గత రెండేళ్లుగా విజయవాడ నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నామని, ఈ ఏడాది ఉప ముఖ్యమంత్రి సహకారంతో ఐజిఎంసి స్టేడియంలో ఏర్పాట్లు చేశామని బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు కె.లక్ష్మయ్య, టి.మనోహర్ నాయుడు తెలిపారు. బుధవారం ఐజిఎంసి స్టేడియంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. బుక్ ఫెస్టివల్ గురించి వివరించారు. పోస్టర్‌ను ఆవిష్కరించారు. మీడియా సమావేశంలో బుక్ ఫెస్టివల్ సొసైటీ గౌరవాధ్యక్షులు బి.బాబ్జీ, సొసైటీ సభ్యులు కె.విజయ కుమార్, గోళ్ల నారాయణరావు, శ్రీశ్రీ విశ్వేశ్వరరావు, వొర ప్రసాద్ పాల్గొన్నారు.

## సిఎస్‌కు ఉన్నతాధికారుల శుభాకాంక్షలు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను పలువురు ఉన్నతాధికారులు, శాఖాధిపతులు, సచివాలయం, ఇతర ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సచివాలయంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ముఖ్య కార్యదర్శులు ముఖేష్ కుమార్ మీనా, కాంతిలాల్ దండే, జయలక్ష్మి, సునీత, శశిభూషన్ కుమార్, డిజిపి ద్వారకా తిరుమలరావు, పలువురు కార్యదర్శులు, కలెక్టర్లు, జెసిలు, వివిధ శాఖల అధిపతులు, ఉద్యోగులు, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్, ఎపి ఎన్‌జిఒస్ అసోసియేషన్ నాయకులు తదితరులు మర్యాద పూర్వకంగా కలవడంతోపాటు సిఎస్‌కు నూతన సంవత్సర శుభాకంక్షలు తెలియజేశారు.

**అభివృద్ధి, సంక్షేమాల్లో కీలకంగా వ్యవహరించాలి**

రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో కీలకంగా వ్యవహరించాలని సిఎస్ విజయానంద్‌కు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన విజయానంద్‌ను సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## ఆరోగ్యాంధ్రప్రదేశ్ అందరి లక్ష్యం

- వైద్యులకు సత్యకుమార్ లేఖ

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ఆరోగ్యాంధ్రప్రదేశ్ మన అందరి లక్ష్యం కావాలని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు. ఈ మేరకు ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులకు, సిబ్బందికి బుధవారం బహిరంగ లేఖ రాశారు. ప్రభుత్వాస్పత్రుల్లో వైద్య సేవ విషయంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని, గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు స్పష్టమైన ఆదేశాలు ఇస్తున్నట్లు చెప్పారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్సకు అయ్యే అధిక ఖర్చు, పరీక్షలు, రోగులకు వైద్యులు అతి తక్కువ సమయాన్ని కేటాయించడం, నర్సింగ్, సాంకేతిక సిబ్బందికి తక్కువ జీతాలు వంటి సమస్యలు ఈ రంగంలో వ్యాపార దృక్పథాన్ని సూచిస్తున్నాయని చెప్పారు. విజన్-2047లో ఆరోగ్య, సంపన్న, ఆనంద ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని ఆవిష్కరించంలో ప్రజారోగ్యానికి కీలక పాత్ర ఉందని తెలిపారు. వైద్య రంగంలో ఉన్న అందరూ వారి వైఖరులపై పునరాలోచన చేయాల్సిన సమయం ఇదని, వైద్యులు, సహాయక సిబ్బంది... రోగులను సానుభూతి, సదవగాహన, నిబద్ధతతో సేవ చేయాలని మంత్రి తన లేఖలో కోరారు.

# విదేశీ విద్య... నిధులు మిధ్య !

- ప్రభుత్వ సాయం కోసం విద్యార్థుల వినతులు
- కోర్టులను ఆశ్రయించిన లబ్ధిదారులు

**ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి**




విదేశీ విద్యా పథకాలకు ప్రభుత్వాలు నిధులు విడుదల చేయకపోవడం సమస్యగా మారింది. ప్రభుత్వ పథకాలను నమ్మి విదేశాలకు వెళ్లిన పేద, మధ్య తరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఎన్‌టిఆర్ విద్యా దీవెన, జగనన్న విదేశీ విద్యా దీవెన పథకాలను పరిశీలిస్తే ఈ విషయాలు తేటతెల్లం అవుతాయి. సమస్య పరిష్కారం కోసం పలువురు లబ్ధిదారులు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. మరికొందరు ప్రభుత్వానికి వినతులు సమర్పిస్తున్నారు.

ప్రపంచ ర్యాంకింగ్‌లో వందలోపు ఉన్న యూనివర్సిటీల్లో స్థానం సాధించిన ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఇబిసి విద్యార్థులకు వైసిపి ప్రభుత్వం 'జగనన్న విదేశీ విద్యా దీవెన' పథకాన్ని వర్తింపజేసింది. ఈ యూనివర్సిటీల్లో స్థానం పొందిన ఒక్కో విద్యార్థి రెండేళ్ల మాస్టర్ కోర్సు పూర్తి చేయడానికి రూ.45 లక్షల నుంచి రూ.1.20 కోట్ల వరకు ఫీజులు చెల్లించాలి. కృష్ణా జిల్లా అవనిగడ్డకు చెందిన కోడూరు భానుఫణికృష్ణ ఈ పథకం కింద అమెరికాలోని చికాగో యూనివర్సిటీలో ఎంబిఎ చదవడానికి వెళ్లారు. ఆ యూనివర్సిటీలో రెండేళ్ల కోర్సుకు ఫీజు కోటి రూపాయలను ప్రభుత్వం చెల్లించాలి. రెండు విడతల్లో రూ.25 లక్షలు ఫీజు విడుదలైంది. మరో రూ.75 లక్షలు ఇంకా విడుదల కావాల్సి ఉంది. ఇప్పటికీ రెండు కిస్తీలు యూనివర్సిటీలో పెండింగ్ ఉన్నాయి. యూనివర్సిటీల ఫీజు భారీగా ఉండటంతో విద్యార్థి తల్లిదండ్రులు ఆ మొత్తం సమకూర్చుకుని పంపడం పెద్ద సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో విద్యార్థి తండ్రి సాంబశివరావు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీ కోసం)లో తమ కుమారుడి విద్యాభ్యాసాన్ని కొనసాగించడానికి అవసరమైన నిధులు విడుదల చేయాలని వినతిపత్రం అందించారు. ఈ పరిస్థితి ఒక్క భానుఫణికృష్ణకు మాత్రమే కాదు.. జగనన్న విదేశీ విద్యా పథకం కింద విద్యనభ్యసిస్తున్న కృష్ణా జిల్లాకు చెందిన మరో 17 మంది విద్యార్థులు ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారు. వీరు చదువుతున్న యూనివర్సిటీలకు రూ.13.20 కోట్ల వరకు ఫీజులు చెల్లించేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేయాల్సి ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది.

**ఏడేళ్లుగా ఎన్‌టిఆర్ విదేశీ విద్య చెల్లింపులు నిల్**

2016లో అప్పటి టిడిపి ప్రభుత్వం బిసి, ఇబిసి విద్యార్థులకు ఎన్‌టిఆర్ విదేశీ విద్యా పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకంలో లబ్ధిదారులైన ఒక్కో విద్యార్థికి రూ.10 లక్షలు మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. 2017-18 ఆర్థిక సంవత్సరం నుంచి లబ్ధిదారులకు ప్రభుత్వ నిధులు నిలిచిపోయాయి. 2019-20లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత లబ్ధిదారుల్లో అనర్హులు ఉన్నారని చెబుతూ విజిలెన్స్ విచారణ చేయించింది. విచారణలో 167 మంది వాస్తవ లబ్ధిదారులు ఉన్నారని గుర్తించింది. కానీ నిధులు మాత్రం విడుదల చేయలేదు. 58 మందికిగానూ ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున రూ.2.90 కోట్లు, మిగిలిన 109 మందికి ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పన రూ.10.90 కోట్లు విడుదల కావాల్సి ఉంది. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎన్‌టిఆర్ విద్యా దీవెన పథకానికి నిధులు విడుదల చేస్తుందని ఆశించారు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా నిధులు విడుదలపై నోరు మెదపడంలేదు. దీంతో కృష్ణా జిల్లాకు చెందిన 27 మంది లబ్ధిదారుల కుటుంబాలు న్యాయస్థానాలను ఆశ్రయించాయి. ప్రభుత్వం నుంచి తమకు నిధులు ఇప్పించాలని కోరుతున్నాయి. మరికొందరు ప్రభుత్వ స్పందన కోసం ఎదురుచూస్తున్నారు.

## రేషన్ బియ్యం మాయం కేసులో విచారణకు హాజరైన పేర్ని జయసుధ

**ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి**

బందరులోని ఇన్వెస్టర్ గోదాములోని పౌరసరఫరాల సంస్థకు చెందిన బియ్యం మాయమైన కేసులో నిందితురాలిగా ఉన్న మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) సతీమణి జయసుధ బుధవారం పోలీసు విచారణకు హాజరయ్యారు. కృష్ణా జిల్లా కేంద్రమైన బందరు తాలూకా పోలీసు స్టేషన్‌లో సిఐ కె.ఏసుబాబు ఆమెను విచారించారు. జయసుధ పేరుతో ఉన్న గోదాములో 378.866 టన్నుల బియ్యం మాయం కావడంపై ఆమెను పలు ప్రశ్నలు అడిగినట్లు తెలుస్తోంది. గోదాము మేనేజర్ మానసతేజ, రైస్‌మిల్లు లీజుదారుడు బొర్రా ఆంజనేయులు మధ్య బ్యాంకు ఆర్థిక లావాదేవీలపైన ప్రశ్నలు అడిగినట్లు సమాచారం. పేర్ని జయసుధ విచారణకు సహకరించినట్లు విచారణాధికారి తెలిపారు. అవసరమైతే మరోసారి విచారణకు పిలుస్తామని వెల్లడించారు. పోలీసుల విచారణకు జయసుధ బందరు మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ వాహనంలో వచ్చారు. 2.40




గంటలపాటు ఆమెను పోలీసులు ప్రశ్నించారు. విచారణ సమయంలో పోలీసులు ఎవరినీ లోనికి అనుమతించలేదు. విచారణ ముగిసే వరకు వైసిపి ముఖ్య నేతలంతా సిఐ ఛాంబర్ వెలుపలే ఉన్నారు. అయితే, సుదీర్ఘంగా విచారణ చేయడం పట్ల జయసుధ తరుపు న్యాయవాదులు, వైసిపి నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. విచారణ జరుగుతున్న గదిలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు వారికి సర్దిచెప్పారు.

## టిఎన్‌యుఎస్ కేలండర్ ఆవిష్కరించిన సిఎం

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం (టిఎన్‌యుఎస్) డైరీ, కేలండర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు. టిడిపి కార్యాలయంలో టిఎన్‌ఎస్‌యు ప్రతినిధులతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అస్తవ్యస్తంగా ఉన్న విద్యా వ్యవస్థను గాడిలో పెడుతున్నామని, ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా టిఎన్‌యుఎస్ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు మన్నం శ్రీనివాస్, నాయకులు పూర్ణచంద్రరావు, టి రామారావు, బాలస్వామి, జగదీశ్, వెంకటరావు, రామచంద్రయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## రాజశేఖర్ సర్వీస్ పొడిగింపు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

వ్యవసాయ, సహకారశాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ సర్వీస్‌ను రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. డిసెంబర్ 31తో ఆయన పదవీ విరమణ చేశారు. అయితే అదే పోస్టులో ఆయనను పునర్నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏడాది పాటు గానీ తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు గానీ ఆయన బాధ్యతలు నిర్వహిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొంది.

## ఉండవల్లిలో సిఎం అధికారిక నివాసం

- ఉత్తర్వులు విడుదల

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

ఉండవల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉంటున్న నివాసాన్ని అధికారిక నివాసంగా గుర్తిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. 2017 నుంచి 2019 వరకూ ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు అక్కడే నివాసం ఉన్నారు. దాని పక్కన సమావేశాల కోసం ప్రజావేదిక పేరుతో కాన్ఫరెన్స్ హాలు నిర్మించారు. కలెక్టర్ల సమావేశం, ఇతర అధికారిక చర్చలన్నీ అక్కడే జరిగేవి. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజావేదికను కూల్చివేసింది. అప్పటి నుండి చంద్రబాబు ఉండవల్లితోపాటు హైదరాబాద్‌లోనూ నివాసం ఉంటున్నారు. ప్రస్తుతం మరలా టిడిపి అధికారంలోకి రావడంతో ఉండవల్లి నివాసానికి సంబంధించి ఉత్తర్వులు విడుదల చేశారు.

## నేడు మంత్రివర్గ సమావేశం

- ఐఆర్, డిఎలపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశం

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 2న సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో సిఎం చంద్రబాబు అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరగనుంది. కేబినెట్ భేటీలో పాలనాపరంగా ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశమున్నట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం మేరకు సంక్రాంతి కానుకగా ఉద్యోగులకు సంబంధించి ఐఆర్, పెండింగ్ డిఎల గురించి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది. ఫిబ్రవరి ఒకటి నుంచి భూముల మార్కెట్ విలువ, రిజిస్ట్రేషన్ ఛార్జీల పెంపు, సంక్షేమ పథకాల అమలుపై చర్చించే అవకాశముంది. వీటితోపాటు ఈ నెల 20 నుంచి 24 వరకు దావోస్‌లో జరగనున్న సదస్సు, పోలవరం, అమరావతి నిర్మాణాల గురించి మంత్రివర్గ సమావేశంలో చర్చించే అవకాశముంది. ఆర్‌టిసిలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం గురించి, అధికారులు సేకరించిన వివరాల గురించి చర్చకు రావచ్చని సమాచారం. ఎస్‌సి వర్గీకరణకు సంబంధించి ఏకసభ్య కమిషన్ పర్యటనలో వస్తున్న అభ్యంతరాలు, ఈ నెల 17న తుది నివేదిక వెలువడనున్న నేపథ్యంలో ఎలా ముందుకు వెళ్లాలనే అంశాలపై కూడా లోతుగా మంత్రివర్గం చర్చించనున్నట్లు తెలిసింది. కేబినెట్ అనంతరం జిందాల్ ప్రతినిధులు వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటుపై సిఎంతో భేటీ అయ్యే అవకాశమున్న నేపథ్యంలో ఈ అంశంపైనా కేబినెట్‌లో ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకునే అవకాశం కూడా లేకపోలేదని తెలిసింది.

## 'మిషన్ వాత్సల్య' అమలుకు కమిటీలు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్రంలో మిషన్ వాత్సల్య పథకం అమలు కోసం రాష్ట్ర, జిల్లా, పట్టణ/గ్రామ స్థాయిల్లో పలు కమిటీలను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మహిళా, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి ఎ సూర్యకుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సిఎస్ అధ్యక్షతన మరో 13 మంది సంబంధిత శాఖల ముఖ్య కార్యదర్శులు / కార్యదర్శులతో రాష్ట్ర స్థాయి పర్యవేక్షణ, సమీక్ష కమిటీ ఉంటుందని, ఈ కమిటీ పథకం అమలు, ఇతర అంశాలను ప్రతి 6 నెలలకోసారి సమావేశమై పర్యవేక్షిస్తుందని పేర్కొన్నారు. మహిళా, శిశు సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి అధ్యక్షతన మరో 13 మంది సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో రాష్ట్ర శిశు సంక్షేమ, రక్షణ కమిటీ ఉంటుందన్నారు.

ప్రతి మూడు నెలలకోసారి సమావేశమై పథకం అమలుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయడంతోపాటు, ఆర్థిక, వార్షిక ప్రణాళికలను సిద్ధం చేసి కేంద్రానికి సమర్పించాల్సి ఉంటుందన్నారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన 15 మంది సంబంధిత శాఖల అధికారులతో జిల్లా శిశు సంక్షేమ, రక్షణ కమిటీని ఏర్పాటవుతుందన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ఆయా స్థానిక సంస్థల పరిధిలో ఉంటే స్టాండింగ్ కమిటీ/సబ్ కమిటీలు ఈ పథకం అమలును పర్యవేక్షించాల్సి ఉంటుందన్నారు. గ్రామ పంచాయతీల పరిధిలో సర్పంచ్ అధ్యక్షతన సంబంధిత శాఖల అధికారులు, వార్డు సభ్యులతో మొత్తం 11 మంది సభ్యులతో కమిటీలను ఏర్పాటుచేసి గ్రామ స్థాయిలో పథకం అమలు పర్యవేక్షించాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# విశాఖ స్టీల్ ఊపిరి తీసి... మిట్టల్‌కు ఊడిగమా?

- 'ఉక్కు' ఉద్యోగులకు 4 నెలలుగా జీతాల్లేవు..
- ఏర్పాటు కాని మిట్టల్ ఉద్యోగుల జీతాలపై కసరత్తా?

**ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో**

ఎప్పుడైనా, ఎక్కడైనా కొత్త పరిశ్రమ, ఫ్యాక్టరీ ఏర్పాటవుతుందంటే ఉద్యోగాలు, పెట్టుబడులు వచ్చి ఆ ప్రాంత ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుందంటూ ఎవ్వరైనా స్వాగతిస్తారు. కానీ అనకాపల్లి జిల్లా నక్కపల్లికి రాబోయే ఆర్సెలార్ మిట్టల్ మాత్రం తద్విరుద్ధమైనదనే చెప్పాలి. తూర్పుతీరాన ఉన్న ఏకైక విశాఖ ఉక్కును బలి కోరుతోంది. ఈ మిట్టల్‌కు బైలదిల్లా నుంచే గనులు రావాలి. విశాఖ స్టీల్‌కు అందుకే రా మెటీరియల్‌ను ఆపేశారన్నది తేలిపోయింది. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ రూ.160 కోట్లు ఖర్చు చేసి ఏలేరు రిజర్వాయర్ నుంచి కాలువ తవ్వి నీటిని పొందుతోంది. అనకాపల్లి జిల్లాలో ఏర్పాటు చేస్తామని చెప్తున్న అర్సెల్లార్ మిట్టల్‌కు ఈ నీటినే వాడేందుకు 'స్కెచ్'ను మోడీ సిద్ధం చేసినట్లు సమాచారం. విశాఖ స్టీలు ప్లాంట్‌లో నాలుగు నెలలుగా 12 వేల మంది పర్మినెంట్ ఉద్యోగులకు జీతాల్లేకపోవడంతో వారి కుటుంబాలు అవస్థలు పడుతున్నాయి. వీరి బాధలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పట్టడం లేదు. పైగా, ఏర్పాటే కాని మిట్టల్ కంపెనీలోని ప్రతి కార్మికునికీ ప్రతి నెలా రూ.5,000 చొప్పున కేంద్ర ప్రభుత్వం ఇవ్వడానికి ఫైలు సిద్ధమైపోయింది. ఇలా... విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై అతిపెద్ద కుట్ర వ్యూహానికి కేంద్రం తెగబడితే, రాష్ట్రంలోని టిడిపి కూటమి పార్టీలు మోడీకి 'జీ హుజూర్' అంటూ మిట్టల్‌కు ఊడిగం చేయడానికి సిద్ధమయ్యాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గడిచిన ఆరు నెలల్లో ఎప్పుడు

విశాఖ స్టీల్ ప్లాంట్




ఢిల్లీ వెళ్లినా, అక్కడే మీడియా ఎదుట విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై చర్చించామని ఒక మాటైనా చెప్పేవారు. ఈసారి పర్యటనలో 'ఉక్కు' మాటే వినపడలేదు. అంతా మిట్టల్ భజనే కనిపించింది. వినిపించింది. విశాఖ ఉక్కుపై కుట్రలు చూస్తే... తొలుత స్టీల్ ప్లాంట్ వాటాలను పోస్కోకు ఇవ్వజూశారు. అదాని గంగవరం పోర్టును అడ్డం పెట్టుకుని ఉక్కు పరిశ్రమను ఇబ్బందుల్లో పెట్టారు. తర్వాత జిందాల్‌ను తెచ్చి ఒక ఫర్నేస్‌ను అప్పగించి స్టీల్‌ప్లాంట్‌ను కట్టబెట్టాలని చూశారు. ఇలా విశాఖ ఉక్కును అష్టదిగ్బంధం చేసి ఊపిరి తీసెయ్యాలని పాలకులు కుట్రలు చేస్తూనే ఉన్నారు.

**పవన్ మౌనమేలనోయి?...**

తాను ప్రశ్నించడానికే పార్టీని పెట్టానని పదేపదే చెప్పుకునే జనసేన అధినేత, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్... 'మిట్టల్‌కు మైన్స్ ఇచ్చినప్పుడు వైజాగ్ స్టీల్ గురించి ప్రశ్నించలేరా? రా మెటీరియల్ ఇవ్వకుండా ఉక్కును ఎండగట్టేసి మిట్టల్‌కు ఎలా ఇస్తారు? అని అడగలేదెందుకు?' అంటూ విశాఖ, ఉత్తరాంధ్ర ప్రాంత కార్మిక, కర్షక ప్రజానీకం అంతా 'కూటమి'పై ఆగ్రహంతో ఉంది. విశాఖ ఎంపీ భరత్‌ను ఐదు లక్షల మెజారిటీతో, స్టీల్ ప్లాంట్ పరిధిలోని గాజువాక ఎంఎల్‌ఎ పల్లా శ్రీనివాస్‌ను లక్షకుపైగా మెజారిటీతో గెలిపించినా వీరికేమీ పట్టడం లేదు. మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన ఇనుప ఖనిజాన్ని ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల గనుల నుంచి సరఫరా చేసేందుకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో కేంద్ర, మన రాష్ట్ర పాలకులు చర్చలు జరుపుతున్నారు. ఈ పరిశ్రమ ఉక్కు ఉత్పత్తుల ఎగుమతుల కోసం సముద్ర తీరంలో ఒక ఓడరేవును కూడా నిర్మిస్తారంటూ ఊదరగొడుతున్నారు. రూ.70 వేల కోట్లతో ఆర్సెలార్ మిట్టల్ రానుందని, 20 వేల ఉద్యోగాలు లభిస్తాయని స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబే ప్రచారకర్తగా మారారు.

### మిట్టల్‌కు భూముల పందేరం

మిట్టల్‌కు వేల ఎకరాల భూముల పందేరం చేయడానికి, నడుస్తున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ పీక నులిపేసేందుకు పాలకులు చూస్తున్నారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి ప్రాంతంలో పిసిపిఐఆర్ కోసం భూ సేకరణ చేయగా ప్రజల్లో వ్యతిరేకత రావడంతో కారిడార్ కోసం మార్చారు. ఎపిఐఐసి వారు ఈ భూములు తీసుకుని మిట్టల్‌కి పందారం చేయాలని చూస్తున్నారు. మిట్టల్‌కు పోర్టును కూడా ఇవ్వాలని డిజైన్‌లో ఉంది. ఇక్కడ కట్టేందుకు అవకాశం లేదని రక్షణ వ్యవహారాల ఎన్‌ఎఒ అధికారులు వెల్లడిస్తున్నారు. ఎస్ఇజడ్, ఫార్మాల్లో పర్మినెంట్ ఉద్యోగాల్లేవు. నిర్వాసితులకు ఆర్ కార్డుల్లేవు. స్టీల్‌ప్లాంట్‌లో 16 వేల ఆర్‌కార్డులిచ్చి 8,600 మందికి మాత్రమే ఉద్యోగాలిచ్చారు. పాలకుల ప్రయోజనాల కోసం తప్ప, మిట్టల్ వస్తే ప్రజలకు ఒరిగిందేమీ లేదు. సిపిఎం అందుకే వ్యతిరేకిస్తోంది.

**- కె లోకనాథం, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు**

# యుపిఐ లావాదేవీల రికార్డ్

- డిసెంబర్‌లో 1673 కోట్లుగా నమోదు
- 2024లో 46 శాతం వృద్ధి




**న్యూఢిల్లీ :** దేశంలో డిజిటల్ చెల్లింపులు నూతన రికార్డ్‌లను సృష్టిస్తున్నాయి. 2024 నవంబర్‌తో పోల్చితే డిసెంబర్‌లో 8 శాతం పెరిగి 1673 కోట్ల లావాదేవీలకు చేరాయి. 2016 ఏప్రిల్‌లో యుపిఐ లావాదేవీలు ప్రారంభమైనప్పటి నుంచి గడిచిన నెలల లావాదేవీలు అత్యధికం కావడం విశేషమని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ) బుధవారం ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. 2024 నవంబర్‌లో రూ.21.55 లక్షల కోట్ల విలువైన లావాదేవీలు జరగ్గా.. డిసెంబర్‌లో 8 శాతం పెరిగి రూ.23.25 లక్షల కోట్లకు ఎగిశాయి.

2023తో పోలిస్తే 2024లో లావాదేవీలు 46 శాతం పెరుగుదల ఉంది. 2023లో 11800 కోట్ల లావాదేవీలు జరిగితే 2024 డిసెంబర్‌లో 17200 కోట్లకు చేరాయి. 2023లో రూ.183 లక్షల కోట్లకు చేరుకున్న యుపిఐ చెల్లింపులు.. 2024లో రూ.247 లక్షల కోట్లకు ఎగిశాయి. గతేడాది పర్సన్ టూ మర్చంట్ లావాదేవీలు జరగడం వల్లే లావాదేవీల సంఖ్య పెరిగింది. నవంబర్ నెల లావాదేవీలతో పోలిస్తే డిసెంబర్ నెలలో 510 మిలియన్ల నుంచి 540 మిలియన్ల లావాదేవీలు పెరిగాయి. నవంబర్‌లో ప్రతీ రోజూ సగటున రూ.71,840 కోట్ల యుపిఐ చెల్లింపులు జరగ్గా.. డిసెంబర్‌లో ఈ సగటు రూ.74,990 కోట్లకు చేరుకుంది. 2023 డిసెంబర్ నెలతో పోలిస్తే 2024 డిసెంబర్‌లో లావాదేవీల్లో 39 శాతం పెరగ్గా.. లావాదేవీల పరంగా 28 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. మరోవైపు 2024 నవంబర్ నెలలో 35.9 కోట్ల ఫాస్టాగ్ లావాదేవీలు జరిగితే డిసెంబర్ నెలలో 38.2 కోట్ల లావాదేవీలు జరిగాయి.


## డిసెంబర్‌లో జిఎస్‌టి వసూళ్లు రూ.1.77 లక్షల కోట్లు

**న్యూఢిల్లీ :** పన్ను వసూళ్లలో ప్రభుత్వ ఖజానా కలకలలాడుతోంది. ప్రతీ నెల వస్తు సేవల పన్ను (జిఎస్‌టి)లు పెరుగుతూ పోతున్నాయి. 2024 డిసెంబర్‌లో రూ.1.77లక్షల కోట్ల జిఎస్‌టి వసూళ్లయ్యింది. రూ.1.7 లక్షల కోట్ల ఎగువన పన్ను వసూళ్లు చోటు చేసుకోవడం పదోసారి. 2023 ఇదే చివరి నెలలో రూ.1.65 లక్షల కోట్ల పన్ను వసూళ్లు జరిగాయి. దీంతో పోల్చితే గడిచిన నెల వసూళ్లలో 7.3 శాతం పెరుగుదల చోటు చేసుకుందని బుధవారం కేంద్ర ఆర్థిక శాఖ తెలిపింది. ఇందులో సిజిఎస్‌టి కింద రూ.32,836 కోట్లు, ఎస్‌జిఎస్‌టి కింద రూ.40,499 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జిఎస్‌టి కింద రూ. 91,200కోట్లు, సెస్‌ల రూపంలో రూ.12,300 కోట్లు చొప్పున నమోదయ్యాయి. దిగుమతులపై విధించిన పన్నుల నుంచి వచ్చిన రెవెన్యూ 4 శాతం పెరిగి రూ.44,268 కోట్లుగా ఉంది. 2024 ఏప్రిల్‌లో అత్యధికంగా రూ.2.10 లక్షల కోట్లు వసూళ్లు నమోదయ్యాయి.

## ఈజీమైట్రిప్ సిఇఒ నిషాంత్ పిట్టి రాజీనామా

**న్యూఢిల్లీ :** ఆన్‌లైన్ టికెటింగ్, బుకింగ్ వేదిక ఈజీ మై ట్రిప్ సంస్థ సిఇఒ నిషాంత్ పిట్టి రాజీనామా చేశారు. వ్యవస్థాపకుల్లో ఒక్కరైన నిషాంత్ వ్యక్తిగత కారణాల రీత్యా ఆ బాధ్యతల నుంచి వైదొలిగినట్లు బుధవారం తెలిపారు. ఇది జనవరి ఒక్కటో తేది నుంచే అమల్లోకి వస్తుందని రెగ్యులేటరీ సంస్థలకు సమాచారం ఇచ్చారు. కాగా.. ప్రస్తుతం సంస్థ సిఎఫ్ఒగా ఉన్న మరో సహ వ్యవస్థాపకుడు, నిషాంత్ పిట్టి సోదరుడు రికాంత్ పిట్టిని తక్షణం సిఇఒగా నియమిస్తూ కంపెనీ నిర్ణయం తీసుకుంది.

## ఇక ఎయిరిండియా విమానాల్లో వైఫై సేవలు




**న్యూఢిల్లీ :** టాటా గ్రూపునకు చెందిన ఎయిరిండియా దేశంలోనే తొలిసారి తన విమానాల్లో వైఫై ఇంటర్నెట్ సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు ప్రకటించింది. ఎయిర్‌బస్ ఎ350, బోయింగ్ 787-9తో పాటు ఎంపిక చేసిన ఎ321 నియో విమానాల్లో ఈ సేవలు లభిస్తాయని వెల్లడించింది. ప్రస్తుతం న్యూయార్క్, లండన్, పారిస్, సింగపూర్ వంటి అంతర్జాతీయ మార్గాల్లో నడుస్తున్న ఎయిర్‌బస్ ఎ350, ఎయిర్‌బస్ ఏ321 నియో, బోయింగ్ బి787-9 ఎయిర్ క్రాఫ్ట్‌లో పైలట్ ప్రాజెక్ట్ కింద ఎయిరిండియా వైఫై సేవలను అందిస్తోంది. దీనికి కొనసాగింపుగా దేశీయంగానూ ఈ సేవలను ప్రారంభించినట్లు తెలిపింది.

## లారీని ఢీకొన్న బైక్

- తోడల్లుళ్లు మృతి
- మహిళ పరిస్థితి విషమం

**ప్రజాశక్తి-మార్టూరు రూరల్ (బాపట్ల)**

లారీని ద్విచక్రవాహనం ఢీ కొన్నడంతో తోడల్లుళ్లు మృతి చెందిన ఘటన బాపట్ల జిల్లా మార్టూరుకు సమీపంలోని రాజుపాలెం - తాతపూడి గ్రామాల మధ్య జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విజయవాడ వాంబే కాలనీకి చెందిన కొల్లు రాంబాబు (32), పల్లపు గోపి (30) తోడల్లుళ్లు. వీరు తాపీ మేస్త్రీలుగా జీవనం సాగిస్తున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా అద్దంకి మండలం ధర్మవరం గ్రామం చర్చిలో నిర్వహించే ప్రార్థనలకు కొల్లు రాంబాబు, ఆయన భార్య ఉమా, మరిది పల్లపు గోపితో కలిసి ఒక బైక్ పైన, గోపి భార్య నాగమణి మరో బైక్‌పై తన తమ్ముడితో కలిసి ధర్మవరం బయలుదేరారు. పల్నాడు-బాపట్ల జిల్లాల సరిహద్దు ప్రాంతమైన తాతపూడి- రాజుపాలెం గ్రామాల వద్ద ముందు వెళుతున్న లారీ ఒక్కసారిగా సర్వీస్ రోడ్డులోకి తిరగడంతో వెనుక వస్తున్న వీరు ద్విచక్ర వాహనాన్ని అదుపు చేయలేక లారీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో తోడల్లుళ్లు ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన ఉమాను చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు, మెరుగైన వైద్యం కోసం గుంటూరు సర్వజన సమగ్ర వైద్యశాలకు తరలించారు. ఉమా పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఐదుగురు ఐజిలకు ఉద్యోగోన్నతులు

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హోదాలో పనిచేస్తున్న 2011 బ్యాచ్ ఐపిఎస్‌లలో ఐదుగురికి ప్రభుత్వం సూపర్ టైమ్ స్కేల్ ఉద్యోగోన్నతులు కల్పించింది. ఈ మేరకు బుధవారం జిఓ ఆర్‌టి నెంబరు 3ను విడుదల చేసింది. సూపర్ టైమ్ స్కేల్ ఉద్యోగోన్నతులు పొందిన వారిలో బి సత్య ఏసుబాబు, సిహెచ్ వెంకట అప్పలనాయుడు, అన్బురాజన్, బాబూజీ అట్టాడ, ఫకీరప్ప కాగినెల్లి ఉన్నారు.

## సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

సంక్రాంతి పండగ రద్దీ దృష్ట్యా ప్రయాణికుల సౌకర్యం కోసం ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది. జనవరి 9 నుంచి 12వ తేదీ మధ్య కాకినాడ-కాకినాడ టౌన్, కాకినాడ టౌన్ - కాచిగూడ, హైదరాబాద్- కాకినాడ టౌన్, కాకినాడ టౌన్ - హైదరాబాద్ మధ్య ఈ ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది. ప్రత్యేక రైళ్లకు బుకింగ్ సదుపాయం జనవరి 2న ఉదయం 8 గంటల నుంచి అందుబాటులోకి రానుంది.

## విదేశాల్లో ఎంబిబిఎస్ సీటు ఇప్పిస్తామని మోసం

- రూ.21.59 లక్షలు కట్టి నష్టపోయిన బాధితుడు
- ముగ్గురు అరెస్టు, నలుగురు పరారీ : డిఎస్‌పి

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి**

ఫిలిప్పిన్స్‌లో మెడికల్ సీట్లు ఇప్పిస్తామని నగదు కట్టించుకుని మోసం చేసిన ముగ్గురు వ్యక్తులను బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను గుంటూరు సౌత్ డిఎస్‌పి పి.మల్లికార్జునరావు మీడియా సమావేశంలో వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా గురజాల గ్రామానికి చెందిన శీలంనేని శ్రీనివాసరావు తన కొడుకు అనిల్‌కుమార్‌ను మెడిసిన్ చదవించాలన్న లక్ష్యంతో గుంటూరు అరండల్‌పేటలో ఉన్న రైట్ ఛాయిస్ జెఎస్ ప్రొఫెషనల్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ అనే సంస్థ ఫౌండర్ కన్నా రవితేజను సంప్రదించారు. ఫిలిప్పిన్స్‌లోని ఫర్‌ఫెక్టువల్ హెల్ప్ మెడికల్ కళాశాలలో సీటు ఇప్పిస్తానని వారు నమ్మబలికారు. హైదరాబాద్‌లో కూడా తమకు బ్రాంచి ఉందని, ఆ బ్రాంచిలో లోహిత, రవికుమార్ పనిచేస్తున్నారని, వారిని కలిస్తే అన్ని ఏర్పాట్లు చేస్తారని నమ్మించారు. శ్రీనివాసరావు వద్ద రూ.21.59 లక్షలు కట్టించుకున్నారు. ఫిలిప్పిన్స్ మెడికల్ కళాశాలలో తన కుమారుడిని చేర్పించకపోవడంతో శ్రీనివాసరావుకు అనుమానం వచ్చి పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు దర్యాప్తు చేపట్టి మొత్తం ఏడుగురు నిందితులను గుర్తించారు. కన్నా బాల రవితేజ, కన్నా బాల శౌరయ్య, పారా రవికుమార్‌లను అరెస్టు చేశామని, మిగతా నలుగురు పరారీలో ఉన్నారని డిఎస్‌పి తెలిపారు.

మరో నలుగురు నిందితుల్లో మురుపాల గీతికా, నారాయణ, పవన్ కల్యాణ్, పొలిమేర శివ ఫిలిప్పిన్స్ దేశంలో ఉండి కార్యకలాపాలు నిర్వహిస్తుంటారని, పెరుమలపల్లి లోహిత హైదరాబాద్‌లో బ్రాంచ్ నిర్వహిస్తుంటారని తెలిపారు.పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## తొలిరోజు లాభాల్లో మార్కెట్లు

**ముంబయి :** కొత్త ఏడాది తొలిరోజు దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాలతో ప్రారంభమయ్యాయి. కొనుగోళ్ల మద్దతుతో బిఎస్ఇ సెన్సెక్స్ 368.74 పాయింట్లు లాభపడి 78,507కు చేరింది. ఇంట్రాడేలో 77,898- 78,756 మధ్య సూచీ కదలాడింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 98.10 పాయింట్ల లాభంతో 23,742.90 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో మారుతీ సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా, ఎల్ అండ్‌టి, బజాజ్ ఫైనాన్స్, టాటా మోటార్స్ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మరోవైపు టాటా స్టీల్, అదానీ పోర్ట్స్, జొమాటో, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, ఎస్‌బిఐ షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి.

## హైకోర్టుకు ఐఅండ్‌పిఆర్ మాజీ కమిషనర్

- ఎసిబి కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ పిటిషన్

**ప్రజాశక్తి-అమరావతి**

సమాచారశాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రకటన జారీ, బిల్లుల చెల్లింపుల్లో అక్రమాలు జరిగాయంటూ ఎసిబి నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ ఆ శాఖ (ఐఅండ్‌పిఆర్) మాజీ కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ కేసులో తీర్పు వెలువడే వరకు తనకు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ఎఫ్ఐఆర్‌లో అసత్యాలన్నీ పేర్కొన్నారని, తనను అన్యాయంగా కేసులో ఇరికించే కుట్ర ఉందని, ఎసిబి దురుద్దేశపూర్వకంగా ఉందన్నారు. దిల్లీ బాబు అనే వ్యక్తి చేసిన ఫిర్యాదు ఆధారంగా ఎసిబి కేసు నమోదు చేయడాన్ని వ్యతిరేకించారు. తన డిప్యూటేషన్ పూర్తయినప్పటికీ ఆ పదవి నుంచి రాష్ట్రం రిలీవ్ చేయలేదన్నారు. ట్రిబ్యునల్‌లో కేసు వేశాకే రిలీవ్ చేసిందన్నారు. ప్రభుత్వం కక్షతో వ్యవహరిస్తోందన్నారు. ఒక వర్గం మీడియాకు పత్రికా ప్రకటనలు జారీ చేశామని ఎసిబి అభియోగాలకు ఆధారాల్లేవన్నారు. పాఠకుల సంఖ్య, పత్రికల అమ్మకాలను ప్రామాణికంగా చేసుకునే పత్రికలు, టివిలకు యాడ్స్ ఇచ్చినట్లు చెప్పారు. ప్రభుత్వం అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 17ఏ కింద విచారణ చేసేందుకు అనుమతినివ్వడం చెల్లదంటూ వేసిన పిటిషన్‌పై హైకోర్టు గురువారం విచారణ చేపట్టనుంది.

## సంభాల్‌లో ఖాకీ చేతిలో గద



**సంభాల్ :** కర్నాటకలో కిష్కింధలో ప్రారంభమైన రథయాత్ర తాజాగా సంభాల్‌లోని పురాతన కార్తికేయ మహాదేవ్ ఆలయానికి చేరుకున్నది. ఈ సందర్భంగా గోవిందానంద సరస్వతి మహరాజ్ భారీ పోలీసు బలగాల సమక్షంలో దర్శనం, పూజలు చేశారు. అయితే రథయాత్ర ముస్లిం ప్రాబల్యం ఉన్న ఖగ్గు సరాయ్ ప్రాంతం గుండా సాగింది. శాంతి భద్రతలను కాపాడాల్సిన సర్కిల్ ఇన్స్‌పెక్టర్ (సీఓ) అనుజ్ చౌదరే రథయాత్ర ముందు చేతిలో గద పట్టుకుని నడవడం చర్చనీయాంశమైంది. చేతిలో గద్దె పట్టుకుని నడవడంపై అడిగిన ప్రశ్నకు, రథయాత్ర ముందు నిలబడి ఉండమని గురూజీ తనకు సూచించారని చెప్పారు. యూనిఫాంలో గద పట్టుకోవడం పాపం కాదు. సనాతన్‌తో పాటు ఇతర వ్యక్తులందరికీ భద్రతను అందించడానికి మేం ఇక్కడ ఉన్నాం. అంతా ప్రశాంతంగా పూర్తయిందంటూ బుకాయించే ప్రయత్నం చేశారు.

# గవర్నర్‌తో బాబు భేటీ

- పలు అంశాలపై చర్చ



**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్‌తో సిఎం చంద్రబాబునాయుడు బుధవారం భేటీ అయ్యారు. గవర్నర్ దంపతులకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. భేటీ సందర్భంగా పలు అంశాలపై గవర్నర్‌తో సిఎం చర్చించినట్లు తెలిసింది. ముఖ్యంగా ఈనెల 20నుంచి 24వరకు దావోస్ లో జరుగనున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరం -2025 సదస్సుకు తనతో పాటు ఐటి శాఖ మంత్రి నారా లోకేష్, ఇండస్ట్రియల్ శాఖ మంత్రి టిజి భరత్, అధికారుల బృందం హాజరవుతున్నట్లు తెలిపినట్లు సమాచారం. దీంతో పాటు ఈ ఏడాది పాలనా పరంగా తీసుకురానున్న సంస్కరణలు, అమరావతిలో భవన నిర్మాణాలు, పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతితో పాటు సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి సిఎం వివరించినట్లు తెలిసింది. అంతకు ముందు ఇంద్రకీలాద్రి మీద ఉన్న కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఆలయం వద్ద సిఎంకు రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి వంగలపూడి అనిత, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్‌సత్యనారాయణ, అదనపు కమిషనరు కె.రామచంద్రమోహన్ , ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా, విజయవాడ సిపి ఎస్‌వి రాజశేఖర్‌బాబులు స్వాగతం పలికారు. అనంతరం సిఎం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రం సుబిక్షంగా ఉండాలని, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ మంచి జరగాలని , ఎవరు ఎక్కడ ఉన్న సంతోషంగా ఉండాలని దుర్గమ్మను కోరుకున్నట్లు తెలిపారు.

**రు.24 కోట్ల సిఎంఆర్ఎఫ్ ఫైలుపై సంతకం**

నూతన సంవత్సరం సందర్భంగా సిఎం చంద్రబాబునాయుడు సిఎంఆర్ఎఫ్ నిదుల విడుదలకు సంబంధించిన ఫైలుపై మొదటి సంతకం చేశారు. ఈ ఫైలుకు సంబందించి 1,600 మంది దరఖాస్తుదారులకు రూ.24కోట్ల మేర నిధులు విడుదల కానున్నాయి.

# రాజధాని పనులకు టెండర్లు

- ఐదు ప్రాజెక్టులకు పిలిచిన సిఆర్‌డిఏ

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

రాజధాని అమరావతిలో సుమారు రూ.2677 కోట్లతో ఐదు ప్రాజెకుటల పనులు చేపట్టేందుకు టెండర్లను బుధవారం సిఆర్‌డిఎ ఆహ్వానించింది. ప్రపంచబ్యాంకు, ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకు(ఎడిబి) ఫైనాన్స్‌తో ఈ పనులు చేపడుతున్నట్లు టెండర్ల డాక్యుమెంట్లలో పేర్కొన్నారు. ఈ నెలలోనే పనులు కాంట్రాక్టర్లకు అప్పగించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. వీలైనంత త్వరగా ఈ పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు. రోడ్లు, డ్రెయిన్లు, నీటి సరఫరా, సీవరేజీ, యుటిలిటీ డక్ట్స్, భూగర్భ పవర్‌లైన్లు, పునర్వినియోగ నీటిలైన్లు, పచ్చదనం, ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పనులు చేపట్టనున్నారు. దీనిలో భాగంగా ప్లానింగ్ జోన్ 1ఏలోని నెక్కల్లు పరిధిలో రూ.448 కోట్లతో, 1బిలో రూ.588.04 కోట్లతో పనులు నిర్వహించనున్నారు. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలతోపాటు అఖిల భారత సర్వీసు అధికారుల నివాసాలకు సంబంధించి నేలపాడు,లో పరిధిలో 12 అంతస్తుల ఎత్తుతో నిర్మించిన 18 టవర్లలో విద్యుత్, లిఫ్టులు, గ్రీనరీ వంటి పనులను రూ.434 కోట్లతో చేపట్టనున్నారు. వీటికి సంబంధించి 22వ తేదీలోపు టెండర్లు దాఖలు చేయాల్సి ఉంటుంది. తుళ్లూరు, అబ్బురాజుపాలెం, రాయపూడి గ్రామాల పరిధిలో పూలింగ్ జోన్ 5డిలో సదుపాయాల కల్పనకు రూ.603 కోట్లతో మరొక టెండరు పిలిచారు. పైగ్రామాలతోపాటు దొండపాటు, బోరుపాలెం, గ్రామాల పరిధిలో 5బి జోన్లో సదుపాయాలకు రూ.603.14 కోట్లతో పనులు చేపట్టేందుకు టెండర్లు ఆహ్వానించారు. జనవరి నుండి పనులు ప్రారంభిస్తామని చెబుతున్న ప్రభుత్వం దానికి అనుగుణంగా వేగంగా ప్రక్రియను ప్రారంభించింది. ఈ పనులను కూడా ఏడాదిన్నరలోపు పూర్తి చేయనున్నారు. ప్రపంచబ్యాంకు ఇస్తున్న నిధులకు ఆరేళ్లలో గ్రేస్ పీరియడ్ ముగియడనుండటంతో అప్పటిలోపు పనులు పూర్తిచేసి పన్నులు వసూలు చేసే విధంగా చూడాలని సిఆర్‌డిఏ అధికారులు ప్రణాళిక రూపొందించారు. ప్రస్తుతం ఉన్న భూములకు ఆస్తిపన్ను రాకపోయినా విఎల్‌టి రూపంలో అయినా ఎంతోకొంత ఆదాయం వస్తుంది. ఇవి కాకుండా ప్రైవేటు సంస్థలు ఏర్పాటైతే వాటి నుండి కొంత ఆదాయం వస్తుందని అంచనాలు రూపొందించారు.

## ఇగ్నో అడ్మిషన్లు ప్రారంభం

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖ)**

ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో జనవరి - 2025 విద్యాసంవత్సరానికిగానూ వివిధ దూరవిద్యా కోర్సులతో పాటు ఆన్‌లైన్ కోర్సులలో ప్రవేశాలకు మంగళవారం ప్రకటన వెలువడింది. విశ్వవిద్యాలయం అందిస్తున్న అన్ని సర్టిఫికెట్, డిప్లొమా, పీజీ డిప్లొమా, డిగ్రీ, అన్ని పీజీ కోర్సులలో ప్రవేశాలు ప్రారంభమయ్యాయని వర్సిటీ సీనియర్ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. ఈ అడ్మిషన్లు ఆన్‌లైన్ ద్వారా పొందవలసి ఉంటుందని పేర్కొన్నారు. ఇగ్నో వెబ్‌సైట్ https:// ignou admission.samarth.edu.in లో ఉన్న అడ్మిషన్ల లింక్ ద్వారా అడ్మిషన్లు పొందవచ్చునని, అన్ని కోర్సులలో ప్రవేశాలకు గడువు తేదీ జనవరి 31 అని తెలిపారు. విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం పరిధిలోని 11 జిల్లాల్లో ఉన్న అధ్యయన కేంద్రాలన్నింటిలో ఈ విద్యా సంవత్సరానికిగానూ ప్రవేశాలు పొందే వీలుందని, ఫీజులు ఆన్‌లైన్ ద్వారానే కట్టాల్సి ఉందని వెల్లడించారు. మరిన్ని వివరాల కోసం ఇగ్నో వెబ్‌సైట్ లేదా ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని ఈ-మెయిల్ ద్వారా సంప్రదించాలని కోరారు.

# సంకల్పానికి సాంకేతికత జోడిస్తే అద్భుత ఫలితాలు

- అధికారులతో చంద్రబాబు మాటామంతి

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

ప్రజల జీవితాల్లో మార్పులు తేవాలనే సంకల్పానికి నూతనత్వం, సాంకేతిక జోడిస్తే ఆయా శాఖల్లో అద్భుత ఫలితాలు సాధించవచ్చని సిఎం చంద్రబాబునాయడు అన్నారు. . రోజు వారీ సమీక్షలకు భిన్నంగా నూతన సంవత్సరం సందర్భంగా సిఎస్, డిజిపి, సిఎంఓ అధికారులతో పాటు వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులతో బుధవారం సచివాలయంలో కొద్ది సేపు సిఎం మాటామంతి నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ కొత్త సంవత్సరం నూతన ఉత్సాహంతో పనిచేద్దామని, ఒక టీమ్‌గా కలిసి పనిచేద్దామని చెప్పారు. ఒక పాజిటివ్ ఎనర్జీతో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు. 2025 లక్ష్యాలేంటి? పనితీరు ఎలా ఉండాలనేది వివరించి కార్యాచరణ అమలు చేయాలని సూచించారు. ప్రతి శాఖలో కూడా రిజల్ట్ ఓరియంటెడ్‌గా పని జరగాలని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న సమయంలో సంస్కరణలంటే పేదలకు వ్యతిరేకం అనే ప్రచారం ఉండేదని,అయినా నాడు ధైర్యంగా సంస్కరణలు అమలు చేశామన్నారు. వాజ్‌పేయి ప్రధానిగా ఉన్న సమయంలో రాష్ట్రంలో కూడా సంస్కరణలు మొదలుపెట్టామని, నేషనల్ హైవేల విషయంలో నాడు తీసుకున్న నిర్ణయంతో స్వర్ణ చతుర్భుజి రోడ్లు వచ్చాయన్నారు. ఓపెన్ స్కై పాలసీ వల్ల విమానయానరంగంలో అనూహ్య మార్పులు వచ్చాయన్నారు. నాడు హైదరాబాద్‌లో చేసిన ప్రతి అభివృద్ధి నేడు అద్భుత ఫలితాలను ఇస్తోందన్నారు. ఒకప్పుడు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అనే వాళ్లమని, నేడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంటున్నామని, ఇందుకు అనుగుణంగా అధికార యంత్రాంగం పనిచేయాలన్నారు. ప్రజలకు ఐదేళ్ల కాలంలో ఏమి చేయాలనేవి అని మాత్రమే కాదని, భవిష్యత్తు అవసరాలకు గుర్తించి విజన్ 2047ని తీసుకువచ్చామన్నారు. ఇందులో పేర్కొన్న 10 లక్ష్యాలను సాధించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. అతిపెద్ద పెట్టుబడులు పెట్టే సంస్థల కార్యకాలపాలు వేగం దాల్చడం కోసం ఒక సీనియర్ ఐఎఎస్ అధికారిని నోడల్ ఆఫీసరుగా నియమించాలని సిఎం సూచించారు.

# ఎంఎస్ అగర్వాల్ ఐరన్ పరిశ్రమలో భారీ అగ్నిప్రమాదం

- బాయిలర్ పేలి 25 మందికిపైగా గాయాలు

**ప్రజాశక్తి- పెళ్ళకూరు (తిరుపతి జిల్లా)**

తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గం పెళ్ళాకూరు మండలం పెన్నేపల్లి వద్ద ఉన్న ఎంఎస్ అగర్వాల్ ఐరన్ పరిశ్రమ-2లో బుధవారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదవశాత్తు ఓ బాయిలర్ పేలిన ఘటనలో 25 మందికిపైగా కార్మికులు తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. వారిని నాయుడుపేట ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. బాయిలర్ పేలిన సందర్భంలో పరిశ్రమ నుంచి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. పెద్దపెద్ద శబ్దాలు రావడంతో పరిశ్రమలోని కార్మికులు పరుగులు తీశారు. శబ్దాల ధాటికి సమీప పల్లెల్లోని ప్రజలు పరిశ్రమ వద్దకు పరుగులు తీశారు. మంటలను అదుపు చేసేందుకు అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం ఎలా జరిగింది? ఎంతమంది గాయపడ్డారు? ఎవరైనా మృతి చెందారా? అనే సమాచారం తెలియాల్సి ఉంది. ప్రమాదం జరిగిన సందర్భంలో పరిశ్రమ నందు సుమారు 50 మంది కార్మికులు సి-షిఫ్ట్‌లో పని చేస్తున్నట్లు తెలిసింది. దీనిపై పరిశ్రమ యాజమాన్యం నోరు విప్పడం లేదు.



ఎంఎస్ అగర్వాల్ ఐరన్ పరిశ్రమ నుంచి భారీగా వెలువడుతున్న మంటలు

## స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్**

రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్టు పద్ధతిలో ఏడాది కాలానికిగాను స్టాఫ్ నర్సుల నియామకానికి నోటిఫికేషన్ విడుదలైందని, అందులో భాగంగా విశాఖపట్నం జోన్-1లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్సు పోస్టులను భర్తీ చేయనున్నామని మెడికల్, హెల్త్ డిపార్టుమెంట్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ పి.రాధారాణి మీడియాకు తెలిపారు. ఈ నెల 15వ తేదీ లోపు పూర్తి చేసిన దరఖాస్తులను ప్రాంతీయ సంచాలకులు, వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం, విశాఖపట్నంలో అందజేయాలని కోరారు. పూర్తి వివరాలకు https://nagendrasvst.wordpress.com చూడాలని సూచించారు.

## సెకి 'అవినీతి'పై ముందుకెళ్లలేం

(మొదటి పేజీ తరువాయి)

పాపాలను సరిచేసేందుకు కొంత సమయం కావాలని, తమ వద్ద మంత్రదండం లేదన్నారు. సాధ్యసాధ్యాలు బట్టి సూపర్ సిక్స్ హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తామన్నారు. తమ ప్రభుత్వం ఏర్పాటు కాకముందే పరిమితికి మించి గత ప్రభుత్వం అప్పులు చేసిందని, దీనివల్ల తమకు కొత్తగా అప్పులు చేసుకునేందుకు అవకాశం లేదన్నారు. 1995లో ముఖ్యమంత్రిగా తన పనితీరు చూశారని, ఇక ముందు కూడా ఆ నాటి సిఎంను చూస్తారని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత సోషల్ రీ ఇంజనీరింగ్ చేస్తున్నామని చెప్పారు. తొలిసారి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పదవిని బిసికి ఇచ్చామన్నారు. బిసిలకు తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా, డిజిపి, కేంద్రమంత్రులుగా అవకాశం ఇచ్చిందన్నారు.

**జగన్ హయాంలో ప్రజలకు ఇబ్బందులు**

జగన్ హయాంలో రాష్ట్రప్రజలు ఎంతో ఇబ్బంది పడ్డారని, తమ ప్రభుత్వం రాగానే వారికి భరోసా కలిగిందన్నారు. వివిధ పార్టీ నాయకులు కూడా తీవ్ర ఇబ్బందులు పడ్డారని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు, రాజధాని అమరావతి నిర్మాణాలకు జగన్ అనేక చిక్కుముడులు వేశారని తెలిపారు. వీటిని విడదీస్తూ అభివృద్ధి చేసుకుంటూ వెళ్తున్నామని చెప్పారు. పోలవరానికి టెక్నికల్ కమిటీ ఫీజిబిలిటీ రిపోర్ట్ ఇచ్చిందని, కేంద్రం నుంచి నిధులు రాబట్టి త్వరలో పూర్తిచేస్తామన్నారు. అనంతరం చంద్రబాబుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలసి ఫోటోలు దిగారు. వికలాంగులతో పాటు వివిధ సమస్యల బాధితుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు.

# పాలకొండలో మందుబాబు హల్‌చల్

- విద్యుత్తు తీగలపై నిద్ర

**ప్రజాశక్తి- పాలకొండ (పార్వతీపురం మన్యం జిల్లా)**

పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలం ఎం.సింగుపురం గ్రామానికి చెందిన బి.వెంకటరమణ తప్పతాగి మద్యం మత్తులో మంగళవారం సాయంత్రం గ్రామంలో హల్‌చల్ చేశారు. పూటుగా మద్యం సేవించి విద్యుత్ స్తంభం ఎక్కి ఏకంగా విద్యుత్ తీగల మీద పడుకున్నారు.

స్తంభం ఎక్కుతుండగా స్థానికులు గుర్తించి వెంటనే లైన్‌మెన్ సూర్యారావుకు సమాచారం అందించారు. దీంతో, ఆయన వెంటనే విద్యుత్తు సరఫరా నిలిపివేయడంతో ఎటువంటి ప్రమాదమూ జరగలేదు. తరువాత స్థానికులు ఆయనను కిందకు దించారు. వెంకటరమణ తల్లికి సామాజిక పింఛను అందడంతో తల్లితో గొడవ పడి ఆమె వద్ద డబ్బులు తీసుకుని వెళ్లి పూటుగా మద్యం సేవించాడని స్థానికులు చెప్తున్నారు. వెంకటరమణ కూడా స్థానికంగా విద్యుత్ పనులు చేస్తూ గ్రామంలో ఉంటున్నారు.



విద్యుత్తు తీగలపై నిద్రపోతున్న మందుబాబు

సంపాదకీయం

# నిజాయితీ ఏదీ?

మణిపూర్‌లో చోటుచేసుకున్న అమానవీయ హింసాకాండపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ చెప్పిన క్షమాపణల్లో నిజాయితీ ప్రశ్నార్ధకంగా మారింది. 2024వ సంవత్సరపు చివరి రోజున ఆయన ఈ ప్రకటన చేసిన తరువాత కూడా కాంగ్‌పోక్సి జిల్లాలో సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ కుకి మహిళలపై విరుచుకుపడ్డారని, ఈ దాడిలో పెద్ద సంఖ్యలో మహిళలు గాయపడ్డారని వార్తలు వచ్చాయి. ఈ సంఘటనపై బీరేన్‌సింగ్ నామమాత్రంగా కూడా స్పందించకపోవడంతో ఆయన చిత్తశుద్ధి ఏపాటిదో తేలిపోయింది. పైగా తన క్షమాపణలపై సందేహాలు వ్యక్తం చేసిన వారిపై ఆయన విరుచుకుపడ్డారు. గతంలో ఎప్పుడో జరిగిన సంఘటనలను ఏకరవు పెట్టారు. అప్పటి పాలకులను ఇప్పటి ఘోరాలకు కారకులుగా చిత్రీకరించే ప్రయత్నం చేయడం ఆయన బరితెగింపునకు నిదర్శనం. గడిచిన ఏడాది కాలమంతా హింసాకాండ చోటుచేసుకుందని ఆయన చెప్పారు. కాని, నిజానికి 2023 మే మూడవ తేదీ నుండి మణిపూర్‌లో హింసాకాండ రగిలింది. అంటే ఒకటిన్నర సంవత్సరంపైగానే! ప్రభుత్వ లెక్కల ప్రకారమే, అప్పటి నుండి 865 కాల్పుల సంఘటనలు చోటుచేసుకున్నాయి. 250 మందికి పైగా మరణించారు. 5,600 ఆయుధాలను, 35 వేల మందుగుండు సామాగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇంత ఘోరం జరుగుతున్నా ఏమాత్రం పెదవి విప్పని ఆయన, ఇప్పుడు విచారం వ్యక్తంచేశారు! 'గత సంఘటనలు' మరచిపోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

తన పాలనలో జరిగిన అత్యంత దారుణమైన జాతి హననాన్ని అదుపు చేయడంలో వైఫల్యానికి క్షమాపణలు చెప్పడానికి, పశ్చాత్తాపం వ్యక్తం చేయడానికి ఒక రాష్ట్ర ముఖ్యమంత్రికి ఒకటిన్నర సంవత్సరాల కంటే ఎక్కువ సమయం ఎందుకు పట్టింది? ఈ ఏడాదిన్నర కాలంలో మన దేశంతో పాటు, ప్రపంచంలోని వివిధ దేశాల్లో విస్తృతంగా పర్యటించిన ప్రధాన మంత్రి నరేంద్రమోడీ మణిపూర్‌కు మాత్రం ఎందుకు వెళ్లలేదు? అక్కడి బాధితులను ఓదార్చడానికి ఆయన ఎందుకు సిద్ధపడలేదు. ఈ నిష్క్రియత్వంపై దేశమంతా విమర్శలు వెల్లువెత్తినా మోడీ నామమాత్రంగా కూడా ఎందుకు స్పందించలేదు? మణిపూర్ వాసులు ఆయన దృష్టిలో భారతీయులు కాదా? తమ పార్టీకి చెందిన ముఖ్యమంత్రి మొక్కుబడిగా స్పందించిన తరువాతైనా ప్రధానమంత్రి నరేంద్రమోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఇంతకాలపు తమ నిర్లక్ష్య వైఖరికి దేశ ప్రజలకు వివరణ ఇస్తారా? పెదవి చివరి నుండైనా క్షమాపణలు కోరుతారా? అత్యున్నత స్థాయి నుండి ఆ మాత్రపు కనీస స్పందన లేకుంటే ఎలా? ప్రజల్లో విశ్వాసం ఎందుకు కలుగుతుంది?

క్షమాపణలు చెప్పిన తరువాత బీరేన్‌సింగ్ ఏం చేయనున్నారు? ప్రజల్లో నమ్మకం కలగాలంటే దారుణాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. వీరిలో అత్యధికులు బిజెపికి చెందినవారేనని అన్ని నివేదికలు చెబుతున్నాయి. ముఖ్యమంత్రి సన్నిహితులమీద కూడా ఆరోపణలు వచ్చాయి. వీరందరిపైనా ఆయన చర్యలు తీసుకోగలరా? హింసాకాండను నివారించాల్సిన అధికార యంత్రాంగం కూడా పెద్దఎత్తున మానవహక్కుల ఉల్లంఘనలకు పాల్పడిన సంఘటనలు వెలుగులోకి వచ్చాయి. వాటికి బాధ్యులైన అధికారులను బీరేన్‌సింగ్ ప్రభుత్వం శిక్షించగలదా? ఇంఫాల్ ఆర్చి బిషప్ డొమినిక్ లూమెన్ చెప్పిన సమాచారం ప్రకారం హింసాకాండ మొదలైన మే 3వ తేదీన మొదటి 36 గంటల్లోనే 249 చర్చిలు దగ్ధంచేశారు. ఈ దాడుల వెనుక మతపరమైన లక్ష్యాలు కూడా ఉన్నాయని, అధికార పార్టీ మద్దతుదారులే ఈ దాడులు చేశారని ఆయన ఆరోపించారు. దాడులకు భయపడి వేలాదిమంది ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని నివాసగృహాలు వదిలి పారిపోయారని సంఘటనలు జరిగిన తేదీలతో సహా రాయిటర్స్ ఒక నివేదికను వెలువరించింది. ఈ నేపథ్యంలో శాంతిని నెలకొల్పడమే లక్ష్యంగా కనీసం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించే చొరవనైనా ముఖ్యమంత్రి చూపగలరా? రెండు వైరి శిబిరాలుగా మారిపోయిన మెయితీ-కుకీ తెగలకు చెందిన వారిని కనీసం కలిసి కూర్చోబెట్టి మాట్లాడగలరా? శాంతి కమిటీ వేసి ఆ దిశలో ప్రజలను సమీకరించగలరా? ఈ చర్యలు తీసుకునే సంకల్పం అసలు బీరేన్‌సింగ్ ప్రభుత్వానికి ఉందా? ఇవేవీ లేకుండా ఊరికే క్షమాపణ చెబితే ఏ ప్రయోజనమూ ఉండదు.

మహనీయుల మాట



తమను ఎవరు ఎలా పాలిస్తున్నారో కచ్చితంగా ప్రజలు తెలుసుకోవాలి. అక్రమాలను ప్రశ్నించాలి. హక్కుల్ని సాధించుకోవాలి. అదీ సమిష్టి ఉద్యమాల ద్వారా, సమరశీల పోరాటాల ద్వారా. మన ప్రజాస్వామ్య జీవన గమనంలోనే ఈ చారిత్రక సత్యం ఇమిడి ఉన్నది. దీనిని విస్మరిస్తే ఎలా..?

- షఫ్దర్ హష్మి,
ప్రజా కళాకారుడు.

విశ్లేషణ

# ఆలయాలు సామూహిక జీవన నిలయాలు





వి. రాంభూపాల్

రాష్ట్ర రాజకీయాలను మతోన్మాదం చుట్టూ తిప్పేందుకు గత రెండు సంవత్సరాలుగా వేగంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. గత ఎన్నికలకు ముందు నుండే విగ్రహాల ధ్వంసం, రథాల దహనం, దేవాలయాల కూల్చివేత సంఘటనలు అనేకం జరిగాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అధికారంలో బిజెపి భాగస్వామ్యం కావడంతో ఈ ప్రయత్నాలు మరింత ముమ్మరం అయ్యాయి. తిరుపతి లడ్డూ వివాదం రాష్ట్రంలోనే కాక దేశంలోనూ, ప్రపంచంలోని భారతీయుల్లోనూ తీవ్ర చర్చకు దారితీసింది. లడ్డు కల్తీ గురించి జరిగిన వాదప్రతివాదనల్లో నుండే సనాతన ధర్మం, హిందూ ఆలయాల పరిరక్షణ లాంటి అంశాలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లేవనెత్తారు. తానే హిందూ మత పరిరక్షకుడుగా వేషం వేయడమేకాక, ప్రాయశ్చితం పేరుతో కనకదుర్గమ్మ గుడి మెట్లను శుభ్రం చేయడం, తిరుమలకు కాలినడకన వెళ్లడం లాంటి వాటితో రాష్ట్రంలో మత రాజకీయాలను నడిపారు. తాను చేయాల్సిన పనులన్నీ కొత్త స్వాములు తలకెత్తుకున్నందుకు ఆనందిస్తున్న హిందూ మత సంస్థలు ఇందులో తాము వెనకబడకూడదనుకున్నాయేమో దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని జనవరి 5న విజయవాడలో భారీ ప్రదర్శన చేయడానికి సిద్ధమయ్యారు. ఇవన్నీ దేనికది విడివిడిగా జరుగుతున్న సంఘటనలు అనుకుంటే పొరపాటు. వీటన్నింటి వెనుక వున్న శక్తులు, వారి దీర్ఘకాలిక లక్ష్య సాధనలో భాగంగానే ఇవి జరుగుతున్నాయి. తెలుగు ప్రజల జీవనంలో భాగమైన సమైక్యజీవన విధానాన్ని దెబ్బతీసి, మతం, దైవం చాటున మతోన్మాద భావాలను విస్తరింపచేసి రాష్ట్రంలో అధికారాన్ని కబ్జా చేయడం ఈ శక్తుల అంతిమ లక్ష్యం. అందులో ఒక ఎత్తుగడ దేవాలయాల స్వయంప్రతిపత్తి నినాదం. చట్టాల నుండి దేవాలయాలకు స్వయంప్రతిపత్తి కావాలట! చర్చి, మసీదుల్లో లేని ప్రభుత్వ జోక్యం దేవాలయాల్లో ఎందుకు? దేవాలయాకు వస్తున్న హిందువుల సొమ్ము ఎక్కడెక్కడో ఖర్చు పెట్టడమేమిటి? అంటూ ప్రజలను నమ్మించేందుకు వంచనతో కూడిన వాదనలు చేస్తున్నారు. వీరికి ఏలేవారి అండదండలు పుష్కలంగా వుండడంతో మీడియా, ఇతర మార్గాల్లో సులభంగా ప్రజల మెదళ్ళలోకి ఎక్కిస్తున్నారు. ఈ పన్నాగాన్ని నివారించకపోతే ఆంధ్రావని మరో మతోన్మాద నిలయంగా మారే ప్రమాదం ఉంది.

ఆలయమంటే సామూహిక సంఘ స్థలమని 1951లో కంచికామకోటి పీఠం పరమాచార్య శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతి ఒక ఇంటర్వ్యూలో వివరించారు. ఆయన మరింత వివరంగా చెబుతూ 'మన దేవాలయాలు ధ్యానం కోసం లేదా సామూహిక పూజల కోసం మాత్రమే కాదు. ఇల్లు, ఆహారం, వస్త్రాలు, ఆభరణాలు, సంగీతం, నృత్యం మొదలైన జీవిత విధానాలను సామూహికంగా నివేదించే స్థలమ'న్నారు. అందుకనే దేవాలయాలు సమిష్టి జీవన విధాన గుర్తులు. భారతదేశం అనాదిగా దేవాలయాల భూమిగా కీర్తించబడింది. మొత్తం సృష్టిని పరమాత్మ అవతారంగా భావించి, రోజువారీ జీవితంలో ఆత్మ (మనిషి) పడుతున్న బాధలు, ఎదుర్కొంటున్న కష్టాలను, సాధించాలనుకుంటున్న కోర్కెలను పరమాత్మ (శక్తి)కు చెప్పుకునే నిలయాలుగా దేవాలయాలను భక్తులు భావిస్తున్నారు. ఈ ఆలయాలు ప్రతి ఒక్కరినీ పవిత్రం చేస్తాయని, ఆ పరమాత్మ అన్ని జీవుల పట్ల అనంతమైన ప్రేమను, దయను కలిగి వుంటాడని విశ్వసిస్తున్న ప్రజలు ఆలయ విగ్రహాన్ని దర్శించడం, పూజలు చేయడం జరుగుతుంది. అయితే గొప్ప తీర్థ క్షేత్రాలుగా వున్న ఆలయాలన్నీ ప్రకృతి సహజ సంపదగా ఉన్న నదులు, పర్వతాలు, అడవుల్లో ఉండడం ద్వారా మనిషికి, ప్రకృతికి వున్న జీవన సంబంధాన్ని చాటిచెబుతున్నాయి. జంతువుల నుండి వేరుపడిన మనిషి ప్రకృతిలో తనకంటే బలమైన గాలి, నీరు, నిప్పు, వెలుతురు, చీకటి ఇలా అనేకం తెలుసుకునే క్రమంలో వాటిని ఆదరించడం ప్రారంభించాడు. ప్రకృతి శక్తులను అతీత శక్తులుగా భావించి వీటిని అదుపులో తెచ్చుకోవడం కోసం మంత్రాలు, క్రతువులు, పూజలు చేశారు. తమ జీవనానికి వేట ప్రధాన ఆధారం కనుక తాము పూజించే శక్తిమూర్తులకు వేట ఆయుధాలను జత చేసి పూజించారు. క్రమంగా రాజ్యాలు ఏర్పడడంతో ఘర్షణలు, యుద్ధాలు పెరిగాయి. ఆ క్రమంలో యుద్ధ ఆయుధాలను కలిగిన దేవతా విగ్రహాలు ఏర్పడ్డాయి. రాజులు తమ పాలన గుర్తుగా, యుద్ధ విజయ చిహ్నంగా భారీ ఆలయాలు నిర్మించారు. ఈ ఆలయాల్లో పూజలు, క్రతువులు నిర్వహించడానికి పౌరోహితులు, వారికి సేవలందించడానికి ఆయగాళ్ళు (పోషకులు), వీరందరిని పోషించడానికి మాన్యాలు (భూములు) అవసరం ఏర్పడింది. దేవాలయాలతోపాటు పూజా పద్ధతులు, మతాచారాలు, పండుగలు, ఉత్సవాల లాంటి సామూహిక జీవన వ్యవస్థ ఏర్పడింది. రాజుల పోషణతో నిర్వహించబడే దేవాలయాలు ప్రముఖ క్షేత్రాలుగా వర్థిల్లాయి. సమాజం ఉమ్మడిగా సృష్టించిన అద్భుత పరిజ్ఞానంలో ఎక్కువ భాగం ఈ దేవాలయాల నిర్మాణంలో, రాజుల భవంతులు, కోటల నిర్మాణంలో ఉపయోగించబడింది. క్రమంగా హిందూ మతంలో శైవులు, వైష్ణవుల లాంటి అనేక ఉపశాఖలు తమ ఆధిపత్యపోరు రాజుల మధ్య యుద్ధాలుగా, ఆ సందర్భంగా ఆలయాల నిర్మాణం, విధ్వంసం యథేచ్ఛగా సాగాయి. కీర్తిగాంచిన దేవాలయాలు సంపద నిలయాలుగా మారడంతో దండయాత్ర చేసినవారు ఇక్కడ నిల్వ వున్న బంగారు, వెండితో పాటు, విలువైన విగ్రహాలను దొంగలించుకు పోయేవారు. ఆ సందర్భంలో దేవాలయాలు, విగ్రహాల విధ్వంసమూ సాగింది.

బ్రిటీష్‌వారు వచ్చిన తర్వాత భూస్వామ్య రాజరికపు వ్యవస్థ బలహీన పడడంతో ఈ ఆలయాల నిర్వహణ ఎవరు చేయాలనే సమస్య వచ్చింది. 1820లో బ్రిటీష్ ప్రభుత్వం మద్రాసు ప్రెసిడెన్సీలోని వివిధ జిల్లాల్లోని కలెక్టర్లను వారి జిల్లాల్లోని మతపరమైన సంస్థల సంఖ్య మరియు వాటి స్థితిగతులపై నివేదించమని కోరినప్పుడు, ప్రెసిడెన్సీలోని ఇరవై జిల్లాల్లో లక్షకు పైగా దేవాలయాలు, ఛత్రాలు, గణితాలు వున్నట్లు, 3 జిల్లాల్లో దాదాపు 300 నుండి 400 వరకు ప్రధాన ఆలయాలు ఉన్నట్లు నివేదించబడిందని ప్రముఖ పరిశోధకులు శ్రీనివాస్ తన పరిశోధనా గ్రంథం 'హిందూ దేవాలయాలు, వాటి భావన, చరిత్ర, వారసత్వం'లో పేర్కొన్నారు. హిందూ దేవాలయాల నిర్వహణను బ్రిటీష్ ప్రభుత్వం చేపట్టి, చట్టాలను రూపొందించింది. 1833 నాటికి మద్రాసు ప్రెసిడెన్సీలో 7,600 దేవాలయాలను ఈ చట్టాల ద్వారా ప్రభుత్వం నేరుగా నిర్వహించింది. అప్పటి వరకు రాజుల స్వంత ఆస్తిగా వున్న దేవాలయాలు ఇలా ప్రభుత్వ చట్టాల పరిధిలోకి వచ్చాయి. స్వాతంత్ర్యానంతరం సహజంగానే దేవాలయ నిర్వహణ ప్రజాస్వామ్య ప్రభుత్వం చేపట్టింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25(1) మత స్వేచ్ఛను ఇస్తుంది. అలాగే ఆర్టికల్ 25(2) మత వ్యవహారాల్లో ప్రభుత్వం జోక్యం చేసుకుని చట్టాలు చేసే లేదా మతపరమైన సంస్థలను నియంత్రించే విధానం గురించి చెబుతుంది. షెడ్యూల్ 7లోని జాబితా మూడులో 28వ భాగం కేంద్రం మరియు రాష్ట్ర శాసనసభలు రెండింటికి ధార్మిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలపై చట్టం చేయడానికి అధికారం ఇచ్చింది. హిందూ మత, ధర్మాదాయ శాఖ (హెచ్‌ఆర్‌సిఇ) చట్టం (1959) ప్రకారం పూజ పద్ధతులు, సాంప్రదాయాల్లో జోక్యం కాకుండా దేవాలయ ఆర్థిక నిర్వహణ, ఆలయ ఆస్తుల నిర్వహణ, నిధుల వినియోగంలో ప్రభుత్వాలు జోక్యం చేసుకునే వీలు కల్పించబడింది. 1960లో ఏర్పడిన హిందూ రెలిజియస్ ఎండోమెంట్స్ కమిషన్ ఆలయాల నిర్వహణలో అక్రమాలు, అవినీతి లేకుండా చూడడానికి, అవి అలౌకిక, రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించకుండా వుండడానికి ప్రభుత్వ నియంత్రణ తప్పనిసరి అని ఈ కమిషన్ భావించింది. అప్పటివరకు మతం పేరుతో సమాజంలో బలులు, మూఢవిశ్వాసాలు, కులం పేరుతో కుల వివక్ష లాంటి అనాగరిక చర్యలను నియంత్రించి దేవాలయాల ప్రారంభం నాడు వున్న స్ఫూర్తికి అనుగుణంగా వాటిని సామూహిక ప్రజా నిలయాలుగా మార్చాలని రాజ్యాంగ నిపుణులు భావించారు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, ఒడిస్సా రాష్ట్ర ప్రభుత్వాలు ఆలయాల నిర్వహణను పర్యవేక్షించేందుకు అనుమతించే 1959 నాటి చట్టానికి అనుగుణంగా రాష్ట్ర చట్టాలు రూపొందించుకున్నాయి. వీటి ఆధారంగా ఆలయ ధర్మకర్తలు, కార్యనిర్వాహక అధికారులు, ఇతర పాలనా సిబ్బందిని ప్రభుత్వాలు నియమిస్తాయి.

మసీదులు, చర్చిలు ఒక పరిమిత ప్రాంతంలో నివాసం వుండే వారు ఏర్పాటు చేసుకునే ప్రార్థనా మందిరాలు. వీటిని ప్రభుత్వ రిజిస్టర్ ద్వారా చట్టబద్ధంగా ఏర్పాటు చేసుకోవాలని చట్టాలు వున్నాయి. వీటి నిర్వహణ రాజ్య నియమ నిబంధనలకు లోబడే వుండాలి. వీటిల్లో వచ్చే ఆదాయ, ఇతర నిర్వహణ సమస్యలను న్యాయ చట్టాల ప్రకారమే ప్రభుత్వాలు, న్యాయస్థానాలు పరిష్కరిస్తున్నాయి. వీటిని మరింత ప్రజాస్వామ్యయుతంగా నడపడానికి ఈ చట్టాల్లో, నియమ నిబంధనల్లో మార్పులు రావాలని కోరడం వేరు, ఆలయాల స్వయంప్రతిపత్తి పేరుతో తరాల నాటి భూస్వామ్య రాజరిక, బ్రాహ్మణీయ వ్యవస్థ తిరిగి కావాలనడం వేరు. ఇప్పుడు ఆలయాల స్వయంప్రతిపత్తి కోరుతున్న సంస్థలు నాటి పాత రాజరిక వ్యవస్థను పునరుద్ధరించాలని, మనువాద సిద్ధాంత ఆధారంగా చాతుర్వర్ణ వ్యవస్థ వుండాలని కోరుకునే పాత తరం ప్రతినిధులు.

ఆలయాల నిర్వహణలో ప్రభుత్వ జోక్యం వుండకూడదని విమర్శించేవారు ప్రధానంగా ఆలయ ఆదాయం, వాటి ఖర్చు తీరుపై వివాదం చేస్తున్నారు. దేవాలయాల ఆదాయాన్ని ఇతర కార్యకలాపాలకు మళ్లిస్తున్నారని, వాటికి స్వయంప్రతిపత్తి ఇవ్వాలని కోర్టులను ఆశ్రయించారు. 1954లో షిరూర్ మఠం కేసు మొదలుకొని ఇటీవల వరకు ఆలయ నిర్వహణలోని లౌకిక అంశాలను పరిరక్షించడానికి ప్రభుత్వాలు జోక్యం చేసుకోవచ్చని, పూర్తిగా మతపరమైన విషయాల్లో జోక్యం చేసుకోవద్దని అనేక కేసుల్లో సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పులు ఇచ్చింది. దేవాలయాలు సామూహిక ప్రజా నిలయాలు కనుకే వీటి నిధులలో కొంత భాగాన్ని విద్య, ఆరోగ్య, సేవా కార్యక్రమాలకు ఖర్చు చేయడానికి చట్టాలు అనుమతించాయి. అలాగే దేవాలయాలు సమాజంలోని అన్ని వర్గాలకు సేవలందించేలా ఏ ఒక్కరికో, కొందరికో ఈ ఆదాయాల మీద ఆధిపత్యం వుండకూడదనే భావనతోనే ప్రభుత్వ జోక్యం అవసరమైంది. అగ్ర కులాలు, నిమ్న కులాలనే కుల ఆధిపత్యాన్ని దేవాలయాల్లో అరికట్టేందుకు, దేవాలయాలు సమాజంలోని బహుళత్వాన్ని, సామాజిక సామరస్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వ జోక్యం తప్పనిసరి. ఆలయాల అర్చకుల నియమాకంలో కులానికి ఎలాంటి పాత్ర ఉండదని, ఆ వ్యక్తి ఆలయానికి సంబంధించిన ఆగమ సూత్రాలపై ప్రావీణ్యం కలిగి ఉండాలని మద్రాసు హైకోర్టు ఇటీవల తీర్పునిచ్చింది. కేరళ వామపక్ష ప్రభుత్వం పూజ ప్రావీణ్య పద్ధతుల నైపుణ్యం ఆధారంగా దళితులు, వెనుకబడిన కులాల వారిని పూజారులుగా నియమించింది.

మసీదులు, చర్చిలు ఒక పరిమిత ప్రాంతంలో నివాసం వుండే వారు ఏర్పాటు చేసుకునే ప్రార్థనా మందిరాలు. వీటిని ప్రభుత్వ రిజిస్టర్ ద్వారా చట్టబద్ధంగా ఏర్పాటు చేసుకోవాలని చట్టాలు వున్నాయి. వీటి నిర్వహణ రాజ్య నియమ నిబంధనలకు లోబడే వుండాలి. వీటిల్లో వచ్చే ఆదాయ, ఇతర నిర్వహణ సమస్యలను న్యాయ చట్టాల ప్రకారమే ప్రభుత్వాలు, న్యాయస్థానాలు పరిష్కరిస్తున్నాయి. వీటిని మరింత ప్రజాస్వామ్యయుతంగా నడపడానికి ఈ చట్టాల్లో, నియమ నిబంధనల్లో మార్పులు రావాలని కోరడం వేరు, ఆలయాల స్వయంప్రతిపత్తి పేరుతో తరాల నాటి భూస్వామ్య రాజరిక, బ్రాహ్మణీయ వ్యవస్థ తిరిగి కావాలనడం వేరు. ఇప్పుడు ఆలయాల స్వయంప్రతిపత్తి కోరుతున్న సంస్థలు నాటి పాత రాజరిక వ్యవస్థను పునరుద్ధరించాలని, మనువాద సిద్ధాంత ఆధారంగా చాతుర్వర్ణ వ్యవస్థ వుండాలని కోరుకునే పాత తరం ప్రతినిధులు. వీరు చేసే ఈ తిరోగామి మార్గం వైపు సమాజం వెళ్లకుండా నిరోధించడం ప్రతి భారతీయుడి కర్తవ్యం.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /

సమస్య

సత్య

# రూపాయి విలువ పతనం!

## గుడ్లప్పగించి చూస్తున్న నమో!




రూపాయి పతనంలో రికార్డుల మీద రికార్డులను బద్దలు కొడుతుంటే ప్రధాని నరేంద్ర మోడీ సర్కార్ మాటా పలుకూ లేకుండా గుడ్లప్పగించి చూస్తున్నది. మోడీ అంటే విశ్వగురువు గనుక ఇలాంటి చిన్న చిన్న విషయాలను పట్టించుకోరని, ప్రపంచ రాజకీయాలను చక్కపెడుతున్నారని అనుకుందాం. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఇతర పెద్దలు ఏమయ్యారు? మంగళ వారం రూపాయి విలువ 13 పైసలు పతనమై 85.65 కనిష్ట స్థాయికి దిగజారింది. నరేంద్ర మోడీ గురించి చరిత్రలో ఇప్పటికే అనేక వైఫల్యాలు నమోదయ్యాయి. ఒకసారి చెప్పిన మాట మరోసారి చెప్పరు. వైఫల్యం గురించి వాటి వలన జనానికి కలిగిన ఇబ్బందులకు విచార ప్రకటన లేదు. రూపాయి పతనం గురించి తాను మాట్లాడిన మాటలను జనం మరచిపోయి ఉంటారన్న గట్టి నమ్మకం కారణంగానే మాట్లాడటం లేదు. బిజెపి ప్రచార కమిటీ నేతగా 2014 ఎన్నికలకు ముందు రూపాయి పతనాన్ని కాంగ్రెస్‌పై దాడికి ఒక ఆయుధంగా వాడుకున్నారు. విలువలు-వలువల గురించి నిత్యం తమ భుజాలను తామే చరుచుకొనే సంఘపరివార్‌కు చెందిన వ్యక్తి నుంచి అనేక మంది జవాబుదారీతనాన్ని ఆశించారు, నమ్మారు. వారందరూ కూడా మౌనంగా ఉంటున్నారు, దేశం ఏమై పోతున్నా పట్టని ఈ బలహీనత ఎందుకు?

రూపాయి విలువ పతనమౌతుంటే గతంలో గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్ర మోడీ ఏమన్నారో తెలుసా! "ఆర్థికం లేదా రూపాయి విలువ పతనం గురించి ప్రభుత్వానికి ఎలాంటి చింత లేదు, తన కుర్చీని ఎలా కాపాడుకోవాలన్నదే దాని ఏకైక ఆందోళన. ఈ కారణంగా దేశం ఈ రోజు ఆశాభంగం చెందింది. గత మూడు నెలలుగా పతనం అవుతున్న రూపాయిని నిలబెట్టేందుకు ప్రభుత్వం ఏ చర్యా తీసుకోలేదు. ఇలా పతనం అవుతుంటే ఇతర దేశాలు దాన్ని అవకాశంగా తీసుకుంటాయి. గడచిన ఐదు సంవత్సరాలుగా ధరలు తగ్గుతాయని, ద్రవ్యోల్బణం అదుపులోకి వస్తుందని ప్రతి మూడు నెలలకు ఒకసారి చెబుతున్నారు తప్ప జరిగిందేమీ లేదు" (2013 ఆగస్టు 20, బిజినెస్ స్టాండర్డ్ పత్రికలో పిటిఐ వార్త). మోడీ ఈ ఆరోపణలు చేసిన రోజు డాలరుకు రూపాయి విలువ 64.11గా ఉంది, తరువాత కొంత మేరకు పెరిగినా గత పదేళ్లలో మొత్తం మీద చూసినపుడు 2024 డిసెంబరు 27వ తేదీ 85.80కు దిగజారింది. పార్లమెంటులో బిజెపికి, దానికి వంత పాడుతున్న పార్టీల బలాన్ని బట్టి 2029 వరకు మధ్యలో అనూహ్య రాజకీయ సంక్షోభం ఏర్పడితే తప్ప ప్రధానిగా మోడీ పదవికి ఎలాంటి ఢోకా ఉండదు. పదేళ్ల క్రితం రూపాయి విలువ పతనం గురించి గుండెలు బాదుకొన్న నరేంద్ర మోడీ పదిహేనేళ్ల అధికార వ్యవధిని పూర్తి చేసుకొనే నాటికి 101కి పతనం అవుతుందని ద్రవ్య వ్యాపార నిపుణులు చెబుతున్నారు. రూపాయి పతన చరిత్రను చూసినపుడు ఇంకా ఎక్కువ మొత్తంలో దిగజారేందుకే అవకాశం ఉంది తప్ప బలపడే లక్షణాలు కనిపించటం లేదు.

ఈ పతనం కొందరికి మోదం ఎందరికో ఖేదాన్ని తెస్తుంది. ఎగుమతులు చేసే వారికి, విదేశాల నుంచి మన దేశానికి డబ్బు పంపేవారికి సంతోషం కలిగిస్తే, విదేశాల నుంచి దిగుమతి చేసుకొనే వస్తువుల భారంతో కోట్లాది సామాన్యులకు జేబు గుల్ల అవుతుంది. అమెరికా అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ ఎన్నికయిన నవంబరు ఐదున రూపాయి విలువ 84.11 ఉంటే డిసెంబరు చివరి వారంలో ముందే చెప్పుకున్నట్లు 85.65ని తాకింది. జనవరి 20న అధికారాన్ని స్వీకరించే సమయానికి, తరువాత ఏమౌతుందో తెలియదు. రూపాయి విలువ పతనాన్ని అరికట్టేందుకు రిజర్వుబాంకు రంగంలోకి దిగి విదేశీ కరెన్సీ విక్రయాలకు పాల్పడి స్థిరంగా ఉండేట్లు చేస్తుంది. ఇప్పుడూ చేసింది, గతంలోనూ చేసింది, అయినప్పటికీ మొత్తం మీద పతనం ఆగటంలేదు. దేశం వెలిగిపోతోంది అని బిజెపి చెప్పుకున్న వాజ్‌పేయి ఏలుబడిలో 2000 సంవత్సరంలో రూపాయి విలువ 43.35 ఉంది. అది మన్మోహన్ సింగ్ అధికారానికి వచ్చిన 2004లో 45.10, మోడీ పదవీ స్వీకారం చేసిన 2014లో 62.33గా ఉంది. ఇప్పుడు 85.65 దగ్గర ఉంది. 1947లో స్వాతంత్ర్యం వచ్చినపుడు రూపాయి విలువ డాలరుకు 3.30 ఉంది. మోడీ అధికారానికి వస్తే ఆయనకు ముఖ్యమంత్రిగా ఉన్న అనుభవంతో రూపాయిని 45కు తిరిగి తీసుకు వస్తారని అనేక మంది పండితులు జోశ్యాలు చెప్పారు. గల్లా పట్టుకు అడుగుదామంటే వారెక్కడా ఇప్పుడు మనకు కనిపించరు. మోడీ నోరు తెరవరు.

ఎవరు చెప్పినా అంకెల తేడాలున్నప్పటికీ పతనం వాస్తవం. రూపాయి పతనాన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌బిఐ చెబుతున్నప్పటికీ ఎలాంటి ఫలితం కనిపించటం లేదు. వర్తమాన ఆర్థిక సంవత్సరంలో డాలరుకు 84 దాటకుండా చూడాలని లక్ష్యంగా చెప్పుకున్నప్పటికీ ఇప్పటికే 86 వరకు రావటాన్ని చూశాం. రోగ నిరోధక శక్తి సన్నగిల్లితే అన్ని రకాల జబ్బులు వస్తున్నట్లు కరెన్సీ విలువ పతనం కూడా ఆర్థిక వ్యవస్థకు అలాంటిదే. ప్రస్తుతం ఈ పరిస్థితి తలెత్తటానికి మూడు ప్రధాన కారణాలను చెబుతున్నారు. విదేశీ మదుపుదార్లు (ఎఫ్ఐఐ) స్టాక్, రుణ మార్కెట్ల నుంచి తమ పెట్టుబడులను వెనక్కు తీసుకొని ఎక్కడ లాభాలు వస్తే అక్కడికి తరలిస్తుండటం. అవి డాలర్ల రూపంలో ఉండటంతో వాటికి డిమాండ్ పెరిగి రూపాయి విలువ తగ్గుతున్నది. అమెరికాలో డోనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా ఎన్నిక, అక్కడ వడ్డీ రేట్లను పెంచటంతో మదుపుదార్లందరూ ప్రభుత్వ బాండ్ల కొనుగోలుకు ఎగబడుతున్నారు. వారి చెలగాటం మన వంటి ఆర్థిక వ్యవస్థలకు ప్రాణ సంకటం. మోడీని ఆయన భక్తులు విశ్వగురువుగా కీర్తిస్తున్నప్పటికీ ఉక్రెయిన్ సంక్షోభం, మధ్య ప్రాచ్యం -పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, తమకు లొంగని దేశాలపై ట్రంప్ బెదిరింపులు, వాణిజ్య పోరు వంటి అనేక సమస్యలు కూడా అనేక దేశాల కరెన్సీల విలువ పతనానికి కారణం అవుతున్నాయి. వాటిని పరిష్కరించటంలో ఎవరూ మోడీ ప్రమేయాన్ని కోరటం లేదు.

పదేళ్ల క్రితం రూపాయి విలువ పతనం గురించి గుండెలు బాదుకొన్న నరేంద్ర మోడీ పదిహేనేళ్లు అధికార వ్యవధిని పూర్తి చేసుకొనే నాటికి 101కి పతనం అవుతుందని ద్రవ్య వ్యాపార నిపుణులు చెబుతున్నారు. రూపాయి పతన చరిత్రను చూసినపుడు ఇంకా ఎక్కువ మొత్తంలో దిగజారేందుకే అవకాశం ఉంది తప్ప బలపడే లక్షణాలు కనిపించటం లేదు. 2024 డిసెంబరు 27న రూపాయి 85.80కి దిగజారి సరికొత్త రికార్డు సృష్టించింది.

రూపాయి పతనం వలన లబ్ధి కంటే మనకు నష్టమే ఎక్కువ. ద్రవ్యోల్బణం, దాంతో ధరల పెరుగుదలకు దారితీస్తుంది. దీని వలన కొనుగోలు శక్తి తగ్గుతుంది. చమురు దిగుమతి బిల్లు పెరిగి అందరి మీదా భారం పెరుగుతుంది. విదేశాల నుంచి రుణాలు పొందిన కంపెనీల మీద భారం పెరుగుతుంది, పరోక్షంగా పెట్టుబడుల మీద కూడా ప్రతికూల ప్రభావం పడుతుంది. రూపాయి విలువ పతనం కాకుండా కాపాడేందుకు ఆర్‌బిఐ తన దగ్గరున్న విదేశీ మారక ద్రవ్యంలో కొన్ని డాలర్లను విక్రయిస్తుంది. దాంతో వాటి సరఫరా పెరిగి రూపాయి విలువ స్థిరంగా ఉంటుందన్నది ఆశ. అయితే తాత్కాలికంగా కొద్ది రోజులు అలా ఉన్నప్పటికీ పతనం సాగుతూనే ఉంది. అదే విధంగా రూపాయల కొనుగోలు, వడ్డీల సవరణ ద్వారా విలువను పెంచేందుకు చూసినా పెద్దగా ఫలితం ఉండటం లేదు. గడచిన ఇరవై సంవత్సరాల్లో సగటున ఏటా 3.2 శాతం పతనం అవుతున్నది. ట్రంప్ ఏలుబడి నాలుగేళ్ల కాలంలో 8-10 శాతం వరకు రూపాయి పతనం చెందవచ్చని ఎస్‌బిఐ పరిశోధన విశ్లేషణ తెలిపింది. కనీసం ఈ పతనాన్ని అయినా నరేంద్ర మోడీ నివారించగలరా? వందిమాగధుల భజనలతో కాలక్షేపం చేస్తారా? రోమ్ తగులబడుతుంటే ఫిడేలు వాయించిన నీరో చక్రవర్తి మాదిరి ఉంటారా?


మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్
editpageps @ gmail.com



## 'రాజస్తాన్ చిన్నారి' కథ విషాదాంతం

**జైపూర్:** రాజస్తాన్‌లోని కోఠ్‌పుత్లీ జిల్లాలో ప్రమాదవశాత్తూ బోరుబావిలో పడిన మూడేళ్ల చిన్నారి కథ విషాదాంతమయింది. 10రోజుల తర్వాత ఎట్టకేలకు చిన్నారిని బుధవారం వెలికి తీశారు. అనంతరం వెంటనే ఆసుపత్రికి తరలించారు. అక్కడ చిన్నారిని పరీక్షించిన వైద్యులు ఆమె మృతి చెందినట్లు ప్రకటించారు. జిల్లాలోని కిరాట్‌పుర గ్రామానికి చెందిన మూడేళ్ల చేతన డిసెంబరు 23న తన తండ్రితో కలిసి పొలానికి వెళ్లింది. అక్కడ ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తూ బోరుబావిలో పడిపోయింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే అధికారులను ఆశ్రయించారు. దీంతో స్థానిక పోలీసులు, ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌టిఆర్‌ఎఫ్ సిబ్బంది రంగంలోకి దిగి భారీ ఆపరేషన్ చేపట్టారు.

తొలుత హుకప్‌టెక్నిక్‌తోనూ, తరువాత బోరుబావికి సమాంతరంగా సొరంగాన్ని తవ్వారు. సొరంగ మార్గంలో పెద్ద బండరాయి అడ్డుగా ఉండటంతో ఆపరేషన్‌కు ఆటంకం ఏర్పడినా, ఎట్టకేలకు 10రోజుల తర్వాత చిన్నారిని బయటకు తీసుకువచ్చారు.



## రక్షణ రంగ సంస్కరణల సంవత్సరంగా 2025

- రాజ్‌నాథ్ సింగ్ వెల్లడి

**న్యూఢిల్లీ :** కొత్త సంవత్సరం రక్షణ రంగ సంస్కరణల సంవత్సరంగా వుంటుందని భారత్ బుధవారం ప్రకటించింది. త్రివిధ బలగాల మధ్య సహకారం, సమన్వయాన్ని మరింత పెంపొందించేందుకు సమగ్ర థియేటర్ కమాండ్‌లకు వెసులుబాటు కల్పించడమే లక్ష్యంగా వుందని భారత ప్రభుత్వం పేర్కొంది. తద్వారా భారత్ మిలిటరీని సాంకేతికంగా అత్యంత ఆధునికమైన యుద్ధ శక్తిగా రూపొందించడం కీలకమని పేర్కొంది. రక్షణ పరికరాల సమీకరణ ప్రక్రియలను, పద్ధతులను మరింత సులభతరం చేయడం, సకాలంలో జరిగేలా చూడడం, కీలకమైన పక్షాల మధ్య మరింత లోతైన సహకారం వుండేలా చూడడం, వున్న వనరులను గరిష్టంగా ఉపయోగించుకునేలా చూడడం ఈ సంస్కరణల లక్ష్యమని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. రక్షణ సన్నద్ధతను కనివినీ ఎరుగని రీతిలో ముందుకు తీసుకెళ్ళడానికి ఈ సంస్కరణలు పునాది వేస్తాయని చెప్పారు. 21వ శతాబ్దంలో ఎదురవుతున్న పెను సవాళ్ళ మధ్య దేశ భద్రత, సార్వభౌమాధికారానికి హామీ కల్పిస్తాయని చెప్పారు. సైన్యం, వైమానిక, నావికా దళాల సామర్థ్యాలను సమ్మిళితం చేస్తూ యుద్ధాలు, సైనిక ఆపరేషన్ల సమయంలో వున్న వనరులను పూర్తి స్థాయిలో వినియోగించుకోవడానికి వీలుగా సమగ్ర థియేటర్ కమాండ్ మోడల్ పనిచేస్తుందని చెప్పారు. ఈ ప్రణాళిక కింద ప్రతి థియేటర్ కమాండ్ కింద మూడు యూనిట్లు పనిచేస్తాయి. ఇవన్నీ కలిసి ఒకే యూనిట్‌గా పనిచేస్తాయి. ప్రస్తుతం త్రివిధ దళాలకు వేర్వేరుగా కమాండ్‌లు వున్నాయి. రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నారు.

## రష్యా, ఇరాన్ గ్రూపులపై అమెరికా ఆంక్షలు

**వాషింగ్టన్ :** రష్యా, ఇరాన్‌లకు చెందిన గ్రూపులపై అమెరికా ఆంక్షలు విధించింది. అమెరికన్ ఓటర్లను లక్ష్యంగా చేసుకుని తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్నారన్న ఆరోపణలపై ఈ ఆంక్షలు విధించినట్లు అమెరికా ఆర్థిక శాఖ అధికారులు తెలిపారు. బూటకపు వీడియోలు, వార్తా కథనాలు, సోషల్ మీడియా పోస్టులు ద్వారా రెండు దేశాల ప్రభుత్వాలు ఓటర్లను మోసం చేసేందుకు ప్రయత్నించాయని, తద్వారా అమెరికా ఎన్నికల పట్ల విశ్వాసం కోల్పోయేలా చేయాలని భావించారని అమెరికా ఇంటెలిజెన్స్ విభాగం ఆరోపించింది. అమెరికా ఎన్నికల ప్రక్రియను రష్యా, ఇరాన్ ప్రభుత్వాలు లక్ష్యంగా చేసుకున్నాయని ఆర్థిక శాఖ తాత్కాలిక అండర్ సెక్రటరీ బ్రాడ్లే టి.స్మిత్ వ్యాఖ్యానించారు. మాస్కోకు చెందిన సెంటర్ ఫర్ జియోపొలిటికల్ ఎక్స్‌పర్టైజ్ కృత్రిమ మేథస్సును ఉపయోగించి డీప్‌ఫేక్ వీడియోలతో తప్పుడు సమాచార వ్యాప్తికి పాల్పడిందని అధికారులు ఆరోపించారు. ఈ సంస్థ డైరెక్టర్‌పై కూడా కొత్త ఆంక్షలు వర్తిస్తాయి. ఇరాన్‌కు చెందిన కాగ్నిటివ్ డిజైన్ ప్రొడక్షన్ సెంటర్ అనేది ఇరాన్ పారామిలటరీ రివల్యూషనరీ గార్డుకు చెందిన అనుబంధ సంస్థ అని అధికారులు పేర్కొన్నారు. ఇజ్రాయిల్ యుద్ధానికి వ్యతిరేకంగా అమెరికాలో నిరసనలు రెచ్చగొట్టడానికి ఈ సంస్థ ద్వారా ఇరాన్ ప్రభుత్వం ప్రయత్నించిందని వారు ఆరోపించారు.

# హింసను అడ్డుకోండి

- రాష్ట్రపతి, ప్రధానికి క్రైస్తవ పెద్దల వినతి
- దాడులు పెరగడంపై ఆందోళన

**న్యూఢిల్లీ :** దేశంలో క్రైస్తవులపై పెరుగుతున్న హింసకు అడ్డుకట్ట వేసేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని 400 మందికి పైగా క్రైస్తవ నేతలు, 30 చర్చి గ్రూపులు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోడీకి విజ్ఞప్తి చేశాయి. క్రిస్మస్ సీజన్ సమయంలో దేశంలోని వివిధ ప్రాంతాల్లో సమావేశమైన క్రైస్తవులను లక్ష్యంగా చేసుకొని హింస, బెదిరింపులు, అడ్డంకులు సృష్టించడం వంటి 14 ఘటనలు చోటుచేసుకోవడాన్ని వారు ప్రస్తావించారు. ఈ మేరకు పత్రికలకు ప్రకటన విడుదల చేశారు. దానిపై థామస్ అబ్రహం, డేవిడ్ ఒనెసిము, జొవాబ్ లోహారా, రిచర్డ్ హోవెల్, మేరీ సారియా, సెడ్రిక్ ప్రకాష్ ఎస్‌జే, జాన్ దయాల్, ప్రకాష్ లూయిస్ ఎస్‌జే, జెల్హో కేహో, ఈహెచ్ ఖర్కాంగర్, అలెన్ బ్రూక్స్, కె.లొసి మావో, అఖిలేష్ ఎడ్గర్, మైకెల్ విలియమ్స్, ఏసీ మైకెల్, విజయేష్ లాల్ వంటి ప్రముఖ క్రైస్తవ నేతలు సంతకాలు చేశారు. దేశంలో క్రైస్తవుల పట్ల అసహనం, శతృత్వం పెరుగుతుండడంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. క్రైస్తవులను లక్ష్యంగా చేసుకొని 720 ఘటనలు జరిగాయంటూ ఎవెంజెలికల్ ఫెలోషిప్ ఆఫ్ ఇండియాకు సమాచారం అందిందని, గత సంవత్సరం జనవరి-నవంబర్ మధ్య నమోదైన 760 కేసులను యునైటెడ్ క్రిస్టియన్ ఫోరం నమోదు చేసిందని వారు వివరించారు. మత మార్పిడుల నిరోధక చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నారని, మత స్వేచ్ఛకు ముప్పు పెరుగుతోందని, విద్వేష ప్రసంగాలు ఎక్కువయ్యాయని, దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదాను నిరాకరిస్తున్నారని



ఒరిస్సాలో దాడిలో ధ్వంసమైన చర్చి

ఆందోళన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో శాంతి స్థాపనకు కృషి చేయాలని వారు ప్రధానిని కోరారు. మతపరమైన మైనారిటీలను లక్ష్యంగా చేసుకొని జరుగుతున్న దాడుల విషయంలో వేగవంతమైన, నిష్పాక్షిక విచారణ జరిపించాలని క్రైస్తవ నేతలు రాష్ట్రపతి, ప్రధానికి విజ్ఞప్తి చేశారు. మత స్వేచ్ఛకు సంబంధించిన రాజ్యాంగ పరమైన హక్కులను పరిరక్షించేలా రాష్ట్రాలకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని కోరారు. అన్ని మతాల ప్రతినిధులతో నిరంతరం సంప్రదింపులు జరపాలని, తమకు ఇష్టమైన మత సంప్రదాయాన్ని ఆచరించేందుకు ప్రజలకు ఉన్న ప్రాథమిక హక్కును కాపాడాలని విజ్ఞప్తి చేశారు. భారత నైతిక చట్రానికి, ఆర్థిక సౌభాగ్యానికి, సామాజిక ఐకమత్యానికి సామరస్యమే కీలకమని వారు ఆ ప్రకటనలో అభిప్రాయపడ్డారు.

# లక్నోలో దారుణం

- తల్లిని, నలుగురు చెల్లెళ్లను హత్య చేసిన వ్యక్తి

**లక్నో :** ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లక్నోలో దారుణం జరిగింది. ఇక్కడ ఒక హోటల్ గదిలో ఓ వ్యక్తి తన తల్లిని, నలుగురు చెల్లెళ్లను హత్య చేశాడు. నిందితుడ్ని బుదౌన్‌కు చెందిన 24 ఏళ్ల అర్షద్‌గా గుర్తించారు. తమ ఇరుగుపొరుగు, లాండ్‌మాఫియా వేధింపులను తట్టుకోలేక, అధికార, రాజకీయ బలం ఉన్న వారిని ఎదుర్కోలేక ఈ దారుణానికి పాల్పడినట్లు తెలిపాడు. ఈ మేరకు అర్షద్ విడుదల చేసిన వీడియో బయటకు వచ్చింది. కొందరు వ్యక్తులు తన చెల్లెళ్లను ఇతరులకు విక్రయించడానికి ప్రయత్నించారని, అందువల్లే తన తండ్రితో కలిసి ఈ ఘోరానికి ఒడిగట్టానని వీడియోలో వెల్లడించాడు. 'మా పొరుగున ఉన్న వ్యక్తులనుంచి వచ్చిన వేధింపుల కారణంగా ఈ తీవ్ర నిర్ణయం తీసుకున్నాను. నా తల్లి, తోబుట్టువులను నేను చంపేశాను. ఈ వీడియో పోలీసులకు అందగానే బాధ్యులు ఎవరో తప్పక తెలిసిపోతుంది. మా ఇల్లు కబ్జా చేయాలనిచూశారు. వారి ఆక్రమణలను అడ్డుకునేందుకు యత్నించాం. కానీ మా మాట ఎవరూ వినలేదు. 15 రోజులుగా చలిలో తిరుగుతూ, ఫుట్‌పాత్ మీదే నిద్రపోతున్నాం. పిల్లలు అలా చలిలో తిరగడం నచ్చలేదు. పత్రాలు మావద్దే ఉన్నా ఇప్పటికే సగం ఇల్లు వారి చేతిలోకి వెళ్లిపోయింది" అని అర్షద్ ఆ వీడియోలో వెల్లడించాడు. మణికట్టు నరాలు కోసి, ఊపిరాడకుండా చేసి వారిని చంపినట్లు చెప్పాడు. తమ కుటుంబ పరిస్థితికికారణమైన పలువురి పేర్లను వెల్లడించాడు. "వారంతా లాండ్ మాఫియాలో భాగం. వారు ఆడపిల్లలను అమ్మేస్తుంటారు. నా తండ్రిని, నన్ను తప్పుడు కేసులో ఇరికించి, నా చెల్లెళ్లను అమ్మేయాలనుకున్నారు. వాళ్లను హైదరాబాద్ తీసుకెళ్లి అమ్ముతుంటే మేం చూడాలా..? అలాంటి పరిస్థితి మాకు రాకూడదు అనుకున్నాం. అందుకే వారిని చంపేశా. అలాగే, మేం బంగ్లాదేశీయులం అంటూ తప్పుడు ప్రచారంచేస్తున్నారు. సహాయం కోసం ఎంతోమంది వద్దకు వెళ్లాం. బతికుండగా మాకు ఎలాంటి న్యాయం దక్కలేదు. చనిపోయిన తర్వాత అయినా మాకు న్యాయం దక్కేలా చూడండి. వారికి కఠిన శిక్ష విధించండి. మా ఇల్లును ఆక్రమించుకున్న వారికి ప్రభుత్వంలోని పెద్దలతో సంబంధాలున్నాయి" అంటూ ఈ వీడియోలో వాపోయాడు.

తమ మరణం తర్వాత ఇంటి స్థలాన్ని ప్రార్థనామందిరానికి కేటాయించాలని, ఇంట్లోని వస్తువులను అనాథాశ్రమానికి ఇవ్వాలని, అలా అయితేనే తమ ఆత్మలకు శాంతి కలుగుతుందని వ్యాఖ్యానించాడు. ఈ హత్యల తర్వాత అర్షద్ కూడా ఆత్మహత్య చేసుకోవాలని భావించినట్లు తెలుస్తోంది. కాగా.. ప్రజలంతా న్యూఇయర్ సంబరాల్లో ఉండగా, లఖ్‌నవూలోని నాకా ప్రాంతంలో ఒక హోటల్‌లో ఈ రోజు ఉదయం ఈ హత్యలు వెలుగుచూశాయి. అతడి చెల్లెళ్ల వయసు 19 నుంచి 9 ఏళ్ల మధ్యలోఉంది. ఘటనా స్థలంలోనే నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.




## రాణే వ్యాఖ్యలపై నోరు మెదపరేం?

- నడ్డాను ప్రశ్నించిన బృందా కరత్

**న్యూఢిల్లీ :** భిన్న సంస్కృతులు, సామరస్యానికి ప్రతీకగా నిలిచిన కేరళను ఉద్దేశించి మహారాష్ట్ర మంత్రి నితేష్ రాణే చేసిన 'మినీ పాకిస్తాన్' వ్యాఖ్యలపై బిజెపి అధ్యక్షుడు జేపీ నడ్డా మౌనం వహించడంపై సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కరత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేరళ చరిత్ర, ప్రజలు, సంస్కృతిని అవమానిస్తూ మహారాష్ట్రకు చెందిన బిజెపి నాయకుడు వ్యాఖ్యలు చేశారని, ప్రతి అంశం పైన స్పందించే నడ్డా తన పార్టీ నేత వ్యాఖ్యలను ఎందుకు ఖండించరని ప్రశ్నించారు. మహారాష్ట్రకు చెందిన తన పార్టీ నాయకుడు కేరళ చరిత్ర, ప్రజలు, సంస్కృతిని అవమానించారు. ఆయనపై బిజెపి చర్య తీసుకుంటుందా? అని బృందా కరత్ నిలదీశారు.

# సుప్రీంకోర్టు కమిటీ ఆహ్వానానికి ఎస్‌కెఎం తిరస్కరణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రైతుల నిరసనపై ఈ నెల 3న జరగనున్న సుప్రీంకోర్టు ప్యానెల్ సమావేశానికి వచ్చిన ఆహ్వానాన్ని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) తిరస్కరించింది. అలాగే, రైతులు కేంద్ర ప్రభుత్వంతో విధానపరమైన సమస్యలపై పోరాడుతున్నారని, కోర్టు జోక్యాన్ని అంగీకరించటం లేదని తెలిపింది. కనుక ఇందులో కోర్టుకు ఎటువంటి పాత్ర లేదని స్పష్టం చేసింది. శంభు, ఖానౌరీ సరిహద్దుల్లో ఎస్‌కెఎం, కిసాన్ మజ్దూర్ మోర్చా ఆధ్వర్యంలో పది నెలలకు పైగా రైతుల ఆందోళనలు జరుగుతునున్నాయి. సమస్యలపై చర్చించడానికి ఈ నెల 3న సమావేశానికి హాజరు కావాలని అత్యున్నత న్యాయస్థానం ప్యానెల్ ఆహ్వానించినప్పటికీ, బుధవారం పంచకులలో జరిగిన ఎస్‌కెఎం సమావేశంలోని నిర్ణయాన్ని ప్రకటించింది. పంజాబ్, హర్యానా హైకోర్టు మాజీ న్యాయమూర్తి నవాబ్ సింగ్ అధ్యక్షతన సుప్రీంకోర్టు 2024 సెప్టెంబర్‌లో కమిటీని ఏర్పాటు చేసింది. పంజాబ్-హర్యానా సరిహద్దులో కొనసాగుతున్న రైతుల నిరసనలపై సుప్రీంకోర్టు నిర్ణయానికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని, తదనుగుణంగా చర్యలు తీసుకుంటామని కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. రైతులతో చర్చలు జరపడంపై మంత్రిని అడిగినప్పుడు "సుప్రీంకోర్టు జైసే నిర్ణయ్ దే రహే హై, ఉస్కే హిసాబ్ సే కార్యవాహి హెూగీ (సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం)" అని మంత్రి అన్నారు. ఆందోళన చేస్తున్న రైతులు తమతో చర్చలు



ఢిల్లీ సరిహద్దులో ఆందోళన చేస్తున్న అన్నదాతలు

జరపాలని కేంద్రాన్ని అభ్యర్థించగా, ప్రస్తుతం సుప్రీం కోర్టు ఈ అంశాన్ని పరిశీలిస్తోందని మంత్రి పేర్కొన్నారు. కాగా, మరోవైపు వైద్య సహాయం తీసుకునేలా రైతు నాయకులు జగ్జీత్ సింగ్ దల్లేవాల్‌ను ఒప్పించే ప్రయత్నాలను పంజాబ్ ప్రభుత్వం బుధవారం కూడా కొనసాగించింది. దీనికి సంబంధించి రైతు నాయకులతో కూడా చర్చలు జరిగాయని మాజీ అదనపు డిజిపి జస్కరన్ సింగ్ చెప్పారు. గత కొన్ని రోజులుగా జస్కరన్ సింగ్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ బృందం దల్లేవాల్‌ను వైద్య సహాయం తీసుకోవాలని ఒప్పించేందుకు అనేక ప్రయత్నాలు చేసింది. అయితే దీనికి ఆయన నిరాకరిస్తునే వస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం చర్చలు జరిపితేనే తాను వైద్యం తీసుకుంటానని స్పష్టం చేశారు.

## ఇజ్రాయిల్ దాడులపై పారదర్శక దర్యాప్తు

- ఐరాస మానవ హక్కుల కార్యాలయ నివేదిక పిలుపు

**జెనీవా :** గాజాలోని ఆస్పత్రులపై ఇజ్రాయిల్ నిర్దాక్షిణ్యంగా సాగిస్తున్న దాడులతో ఆ ప్రాంత ఆరోగ్య సంరక్షణా వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోతోందని, దీనివల్ల పాలస్తీనియన్లకు వైద్యం పూర్తిగా దూరమవుతుందని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల హై కమిషనర్ (ఒహెచ్‌సిహెచ్‌ఆర్) కార్యాలయం మంగళవారం విడుదల చేసిన నివేదిక పేర్కొంది. ఈ దాడులపై స్వతంత్రంగా, సమగ్రంగా, పారదర్శకంగా దర్యాప్తు జరగడం చాలా ముఖ్యమని ఆ నివేదిక పేర్కొంది. అంతర్జాతీయ మానవ హక్కుల చట్టాల ఉల్లంఘనకు పూర్తి జవాబుదారీ వహించాలని యుఎన్ హై కమిషనర్ వోల్కర్ టర్క్ కోరారు. 2023 అక్టోబరు 12 నుండి 2024 జూన్ 30 మధ్య కాలంలో జరిగిన దాడుల వివరాలను ఈ నివేదికలో పొందుపరిచారు. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా ఇజ్రాయిల్ వ్యవహరించే తీరు పట్ల తీవ్రమైన ఆందోళన కలిగిస్తోందని ఆ నివేదిక పేర్కొంది. గాజాలో ఆస్పత్రులపై విచక్షణారహితంగా జరిగిన దాడులతో రోగులు, వైద్య సిబ్బందికి తీరని నష్టం జరిగిందని, మానవతా సంక్షోభం మరింత ముదిరిందని నివేదిక పేర్కొంది. ఆస్పత్రులన్నింటినీ సైనిక ప్రయోజనాలకు ఉపయోగిస్తున్నారని, అందుకే తాము ఆస్పత్రులపై దాడులు చేస్తున్నామని ఇజ్రాయిల్ చెబుతోందని కానీ అవన్నీ నిరాధారమైన, అస్పష్టమైన ఆరోపణలని నివేదిక స్పష్టం చేసింది. బహిరంగంగా అందరికీ అందుబాటులో వుండే సమాచారానికి పూర్తి విరుద్ధంగా ఇజ్రాయిల్ ఆరోపణలు వుంటున్నాయని పేర్కొంది.

## సోలార్ గ్రేట్‌వాల్.. చైనా మరో ఘనత



**బీజింగ్ :** చైనా మరో భారీ ప్రాజెక్టు సోలార్ గ్రేట్‌వాల్‌ను త్వరలో పూర్తి చేయనుంది. సుమారు 400 కిలోమీటర్ల పొడవు.. 5 కిలోమీటర్ల వెడల్పుతో దీని నిర్మాణం చేపట్టనున్నారు. ఇక్కడినుంచి సుమారు 100 గిగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకొన్నారు. దీంతో బీజింగ్ విద్యుత్తు అవసరాలను పూర్తిగా తీర్చనున్నారు. ఇప్పటివరకు దాదాపు 5.4 గిగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయగల సోలార్ ప్యానల్స్‌ను అమర్చినట్లు చైనా వెల్లడించింది.

ఇన్నర్ మంగోలియాలోని కబుకీ ఎడారిలో దీని నిర్మాణపనులు వేగంగా జరుగుతున్నాయి. గతంలో నిర్మానుష్య ఎడారి ప్రాంతాన్ని సీ ఆప్ డెత్‌గా అభివర్ణించేవారు. తాజాగా దీనిపై నాసా ఎర్త్ అబ్జర్వేటరీ దీనిపై స్పందిస్తూ "ఇటీవల కాలంలో ఈ ప్రాంతంలో ఏర్పాటుచేసిన సోలార్ ప్యానెళ్ల కారణంగా ఫొటోవాల్టిక్ సముద్రంగా ఈ ప్రాంతం మారిపోయింది" అని పేర్కొంది. కబుకీ ఎడారిలో వేడి వాతావరణం, చదునైన భూమి, పారిశ్రామిక ప్రాంతాలు దగ్గరగా ఉండటం వంటి అంశాలు సోలార్ ప్రాజెక్టుకు దానిని అనువుగా చేస్తాయి. పరిగెత్తే గుర్రం ఆకారంలో జున్మా సోలార్ పవర్ స్టేషన్‌ను ఇక్కడ నిర్మించింది. ప్రపంచంలోనే అతిపెద్ద సోలార్ ప్యానల్స్ ఇమేజ్‌గా ఇది రికార్డు సృష్టించింది. ఇది ఏటా 200 కోట్ల కిలోవాట్ పర్ అవర్ విద్యుత్తు ఉత్పత్తి చేయగలదు. దాదాపు 4,00,000 మంది ప్రజల అవసరాలను ఇది తీర్చగలదు. ప్రస్తుతం చైనా సోలార్ విద్యుత్తు సంస్థలు మొత్తం కలిపి 3,86,875 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయగలవు. ఇది ప్రపంచం మొత్తం సామర్థ్యంలో సగానికి సమానం. ఆ తర్వాత స్థానంలో అమెరికా 79,364 మెగావాట్లను ఉత్పత్తి చేయగలదు.

## పాక్ జైళ్లలో మగ్గుతున్న మా పౌరులను అప్పగించండి

- భారత్ విజ్ఞప్తి

**న్యూఢిల్లీ :** పాక్ జైళ్లలో మగ్గుతున్న 183మంది భారత జాలర్లు, పౌరులను తక్షణమే విడుదల చేసి అప్పగించాలని బుధవారం కేంద్ర ప్రభుత్వం పాకిస్తాన్‌ను కోరింది. పాకిస్తాన్ కస్టడీలో వున్న 18మంది పౌరులు, జాలర్లకు తక్షణమే కాన్సులార్ సాయం అందించాలని కూడా కోరినట్లు భారత విదేశాంగ శాఖ అధికారలు తెలిపారు. 2008లో కుదిరిన ఒప్పంద నిబంధనల మేరకు ప్రతి ఏటాది జనవరి 1వ తేదీన, జులై 1న ఇరు దేశాలు తమ వద్ద ఖైదీలుగా వున్న పౌర, జాలర్ల వివరాల జాబితాను మార్చుకుంటాయి. అందులో భాగంగా భారత్ అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరింది. తమ కస్టడీలో వున్న 381మంది పౌరులు, 81మంది జాలర్ల వివరాలను భారత్, పాక్‌కు అందచేసింది. అలాగే పాకిస్తాన్ కూడా తమ వద్ద వున్న 49మంది పౌరులు, 217మంది జాలర్ల వివరాలను అందచేసిందని విదేశాంగ శాఖ అధికారులు తెలిపారు. జాలర్లను వారి బోట్లతో సహా విడుదల చేసి, అప్పగించాలని భారత ప్రభుత్వం కోరింది. ప్రస్తుతం తమ జైళ్ళలో 682మంది భారతీయులు వున్నారని పాకిస్తాన్ ధృవీకరించింది. మానవతా సంబంధమైన అంశాలను ప్రాధాన్యతా ప్రాతిపదికన పరిష్కరించేందుకు భారత్ కట్టుబడి వుందని విదేశాంగ శాఖ తెలిపింది. ఈ నేపథ్యంలో తమ వద్ద వున్న 76మంది పౌరుల జాతీయతను ధృవీకరించాల్సిందిగా కూడా భారత్, పాకిస్తాన్‌ను కోరింది. వారిని పాకిస్తానీయులుగా భారత ప్రభుత్వం భావిస్తోంది.

**8 మంది పాక్ పౌరులకు 20 ఏళ్ల జైలు**

డ్రగ్స్ కేసులో ఎనిమిది మంది పాకిస్తాన్ పౌరులకు ముంబయి కోర్టు జైలు శిక్ష విధించింది. 2015లో దాదాపు రూ.7కోట్ల విలువైన 200 కిలోల డ్రగ్స్ కేసులో ఒక్కొక్కరికి 20 ఏళ్ల పాటు జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. మాదక ద్రవ్యాల నిరోధక చట్టం కింద వీరిని దోషులుగా నిర్ధారించిన ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి వారికి శిక్షలు ఖరారు చేశారు. గరిష్ఠంగా 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.2లక్షల చొప్పున జరిమానా విధించారు.

2015లో గుజరాత్ తీరంలో హెరాయిన్‌ను తరలిస్తున్న బోటును భారత కోస్ట్‌గార్డు అధికారులు పట్టుకున్నారు. ఆ బోటులో 11 డ్రమ్ములు, గోధుమ వర్ణంలోని పొడితో కూడిన 20 ప్లాస్టిక్ పౌచ్‌లను గుర్తించారు. ఆ ప్యాకెట్లలోని పదార్థాన్ని గుర్తించగా.. హెరాయిన్ అని తేలింది. ఎనిమిది మంది పాకిస్తాన్ పౌరులతో పాటు మూడు శాటిలైట్ ఫోన్‌లు, జీపీఎస్ నావిగేషన్ చార్ట్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను సీజ్ చేశారు. నిందితులకు గరిష్ఠంగా శిక్ష విధించాలని, మాదకద్రవ్యాల అక్రమ రవాణా చేసేవారికి ఈ తీర్పు హెచ్చరికగా ఉండేలా చూడాలని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుమేశ్ పుంజ్వానీ కోర్టును అభ్యర్థించారు. ఇరు పక్షాల వాదనలు విన్న జడ్జి.. ఈ కేసులో దోషులకు శిక్షలు ఖరారు చేశారు.

## అణు స్థావరాల వివరాలు మార్పిడి చేసుకున్న భారత్- పాక్

**న్యూఢిల్లీ :** భారత్, పాకిస్తాన్ తమ దేశాల్లోని అణు స్థావరాల జాబితాను పరస్పరం మార్పిడి చేసుకున్నాయి. మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయాన్ని ఈ ఏడాది కూడా పాటించాయి. ఈ విషయాన్ని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

ఒక దేశంలోని అణు కేంద్రాలపై మరో దేశం దాడి చేయకూడదనే ద్వైపాక్షిక ఒప్పందంలో భాగంగా ఈ జాబితాను అందజేసుకున్నాయి. ఇరుదేశాలు ఏకకాలంలో ఈ ప్రక్రియ పూర్తి చేసినట్లు విదేశాంగ శాఖ తెలిపింది. "దౌత్యమార్గాల ద్వారా భారత్, పాకిస్తాన తమ అణు స్థావరాల జాబితాను పంచుకున్నాయి. ఏకకాలంలో ఈ ప్రక్రియ పూర్తయ్యింది. కాశ్మీర్ సమస్యతో పాటు ఉగ్రవాదంపై కూడా రెండు దేశాల మధ్య జాబితా మార్పిడి జరిగింది. ఈ జాబితాను ఇలా ఇచ్చిపుచ్చుకోవడం ఇది వరుసగా 34వ సారి" విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. 1988 డిసెంబర్ 31న అణు స్థావరాలపై దాడులకు వ్యతిరేకంగా ఇరుదేశాల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం ఈ వివరాలను పరస్పరం అందజేసుకుంటున్నాయి. ఒప్పందం ఆర్టికల్-2 నిబంధన ప్రకారం ప్రతి సంవత్సరం అణు స్థావరాల సమాచారం అందజేసుకోవాలి. దీని ప్రకారం 1992 జనవరి 1 నుంచి ప్రతి సంవత్సరం అదే రోజు అణు సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకుంటున్నాయి.

## భద్రతా మండలిలో పాక్

**న్యూఢిల్లీ :** ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో తాత్కాలిక సభ్యదేశంగా పాకిస్తాన్ చేరింది. ఈ సందర్భంగా ఆ దేశ దౌత్యవేత్త మునీర్ అక్రమ్ మాట్లాడుతూ తమ దేశం చురుకైన నిర్మాణాత్మక పాత్రను పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రపంచం ఎదుర్కొంటున్న కీలక సమస్యల పరిష్కారం కోసం పాక్ యత్నిస్తుందన్నారు. పాకిస్తాన్ 2025 జనవరి నుంచి 2026 డిసెంబరు వరకు ఐరాసలోని 10 తాత్కాలిక సభ్యదేశాల్లో ఒకటిగా ఉంటుంది. ఇప్పటి వరకు జపాన్ ఉన్న స్థానంలో ఇక నుంచి పాక్ వచ్చి చేరింది. డెన్మార్క్, గ్రీస్, పనామా, సోమాలియా దేశాలు కూడా కొత్తగా భద్రతా మండలిలోకి వచ్చాయి. గతంలో పాకిస్థాన్ 2012-13, 2003-04, 1993-94, 1983-84, 1976-77, 1968-69, 1952-53లో భద్రతా మండలితో కలిసి పనిచేయడం గమనార్హం.

ఇస్లామిక్ స్టేట్, అల్ ఆంక్షల కమిటి నిర్ణయాలు, ఉగ్రవాదులను గుర్తించే తీర్మానాల్లో పాక్ ముఖ్యపాత్ర పోషించనుంది. భద్రతా మండలి ఏర్పడి ఏడున్నర దశాబ్దాలు దాటిపోయింది. 53 దేశాలతో ప్రారంభమైన ఐరాసలో ఇప్పుడు సభ్యదేశాల సంఖ్య 193కు చేరినా, ఇన్నేళ్లలో భద్రతా మండలిని మాత్రం ఒకే ఒక్కసారి 1965లో విస్తరించారు. దాంతో మండలి సభ్యదేశాల సంఖ్య 15కు చేరింది. అయితే వీటిలో వీటో అధికారం కలిగిన శాశ్వత సభ్యదేశాలుగా అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్‌లే నేటికీ కొనసాగుతున్నాయి. మిగతా 10 తాత్కాలిక సభ్య దేశాలు రొటేషన్ పద్ధతిపై మారుతుంటాయి.



## దక్షిణ కొరియా విమాన ప్రమాదంలో బ్లాక్ బాక్స్ లభ్యం

- మృతదేహాల గుర్తింపు పూర్తి

**సియోల్ :** ఆదివారం జరిగిన ఘోర విమాన ప్రమాదానికి కారణమైన జెజూ ఎయిర్ లైన్స్‌కి చెందిన విమానం బ్లాక్ బాక్స్ లభ్యమైందని దర్యాప్తు అధికారులు తెలిపారు. వీటి నుండి ప్రాథమిక సమాచారాన్ని వెలికితీసినట్లు బుధవారం చెప్పారు. సిబ్బందితో సహా 181మంది ప్రయాణిస్తున్న ఈ విమాన ప్రమాదంలో కేవలం ఇద్దరే బతికి బయటపడ్డారు. మరణించిన వారందరినీ గుర్తించినట్లు తెలిపారు. విమానం దారుణంగా ధ్వంసం కావడంతో మృతదేహాలు గుర్తు పట్టడం చాలా కష్టమవుతోందని అన్నారు. దీంతో ఈ ప్రక్రియ కాస్తంత మందకొడిగా నడుస్తోంది. సంఘటనా స్థలంలో దక్షిణ కొరియా, అమెరికా దర్యాప్తు అధికారులు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. ఈ విమానానికి చెందిన బ్లాక్ బాక్స్‌లు, కాక్‌పిట్ వాయిస్ రికార్డర్‌లను స్వాధీనం చేసుకున్నామని పౌర విమానయాన డిప్యూటీ మంత్రి జూ జోంగ్ వాన్ తెలిపారు.

వీటి నుండి సమాచారం వెలికి తీయాల్సిన ప్రక్రియ పూర్తయిందన్నారు. ప్రాథమిక డేటాను ఆధారంగా చేసుకుని దీన్ని ఆడియో ఫార్మాట్‌లో మార్చడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. అంటే పైలట్ చివరి మాటలను దర్యాప్తు అధికారులు వినడానికి వీలుగా రూపొందిస్తారని చెప్పారు. ఫ్లైట్ డేటా రికార్డర్ అయిన రెండో బ్లాక్ బాక్స్ లభ్యమైంది కానీ దాని కనెక్టర్ గల్లంతైందని చెప్పారు. దీన్నుండి సమాచారాన్ని ఎలా వెలికితీయాలనే విషయమై నిపుణులు సమీక్షిస్తున్నారన్నారు. వివిధ సాక్ష్యాధారాలను సమగ్రంగా సమీక్షించిన తర్వాత ఈ అంశంపై ఒక నిర్ణయానికి వచ్చే అవకాశముందని చెప్పారు. 179మంది బాధితుల గుర్తింపు ప్రక్రియ పూర్తయిందని బుధవారం తాత్కాలిక అధ్యక్షుడు చోయి సాంగ్ మోక్ ఒక ప్రకటన చేశారు.



**మీకోసం**

ఫ్రిజ్‌లో వాసన పోవాలంటే నిమ్మకాయను రెండు చెక్కలుగా కోసి ఫ్రిజ్ మూలల్లో పెట్టాలి.

**జీవన సౌరభం**

జరిగిపోయిన నిన్న, జరగబోయే రేపటి కంటే, గడుపుతున్న ఈ రోజే ఎంతో విలువైనది.



# పుస్తకాల పండుగ



బెజవాడలో జాతరలా జరిగే
పుస్తకాల పండుగ వచ్చింది
పుస్తక ప్రియులను రారమ్మంటూ
ఆహ్వానం పలుకుతోంది!

ఏటేటా కొత్త సంవత్సరంలో వచ్చే
విజ్ఞాన వెలుగుల పండుగ ఇది
పదకొండు రోజులు ఆహ్లాదంగా సాగే
పుస్తక తిరునాళ్ళు ఇవి!

వందలాది స్టాళ్ళు
లక్షలాది పుస్తకాలు
వివిధ సాహితీ, సాంస్కృతిక వేదికలు
పుస్తక ప్రాంగణానికి వన్నెచిన్నెలు!

పుస్తక ప్రదర్శనలు
సాంస్కృతిక మైలురాళ్ళు
అన్ని వయసులవారిని ఆకర్షించే
కనుల పండుగైన విజ్ఞానపు దొంతరలు!


పుస్తకం మనిషికి హస్తభూషణం
పుస్తక పఠనం మస్తకానికి ఆనందం

మాట్లాడని మహావక్తగా భావించే పుస్తకం
అజ్ఞానపు చీకటిని తొలగించే జ్ఞానదీపం!

మంచి పుస్తకం నీ చెంత ఉంటే
స్థిరమైన స్నేహితుని అండ నీకున్నట్లే
పుస్తకాలు తరచూ చదువుతుంటే
నీవు విజ్ఞానాన్ని పెంచుకుంటున్నట్లే!

రకరకాల పుస్తకాలతో
మంచి మంచి కార్యక్రమాలతో
పిల్లలను పెద్దలను ఆకర్షించి, అలరించే
బుక్ ఫెయిర్‌లు అపార జ్ఞాన దీపికలు!

**- పి.వి.ప్రసాద్,**
**94401 76824.**



## దారి చూపండి

**పిల్లలూ, తేనెటీగ పూల దగ్గరికి వెళ్లే దారి చూపించరూ!**

## నేను గీసిన బొమ్మ



**పి.యశ్వంత్,**
8వ తరగతి,
క్రాంతి ఇంగ్లీషు మీడియం,
విజయవాడ.




**పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com**


# ప్రోగ్రామింగ్‌తో పనులు చేసేస్తాయ్ ..!



**టీచరు చెప్పే విషయాలను పిల్లలు శ్రద్ధగా వింటారు. ఆలకిస్తారు. ఆలోచించి ఆచరణలో పెడతారు. ప్రాథమిక విద్యలోనే పిల్లలకు మంచిచెడ్డలతోపాటుగా సామాజిక, జీవన విలువలు నేర్పిస్తే వాటినే పాటిస్తారు. భవిష్యత్తులో ఆచరించే ప్రయత్నం చేస్తారు. సాంకేతికపరంగా కంప్యూటర్ రంగంలో అనూహ్యమైన మార్పులు వస్తున్నాయి. రోజురోజుకూ సాంకేతికత మరింత సృజనాత్మకంగా మారుతోంది. కొత్త ఫీచర్లు, పోగ్రామ్‌లు, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ అంశాలు మార్పు చెందుతున్నాయి. మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకునే వారే భవిష్యత్తు మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందుకోగలరు. పిల్లలకు చిన్నప్పటి నుంచి మొబైల్‌పై పరిజ్ఞానం ఉంటుండటంతో పాఠశాల స్థాయి నుంచి కంప్యూటర్ సబ్జెక్టులను కొనసాగిస్తున్నాయి. అడ్వాన్స్ టెక్నాలజీలను వాడుతున్నాయి. నిపుణులతో సరికొత్త రీతిలో బోధనలు చేయిస్తున్నాయి.**

రోబో సినిమాలో చూసినట్లుగా.. కల్కి సినిమాలో చేసినట్లుగా నిజజీవితంలో కూడా రోబోలు చేస్తున్న సందడి అంతా ఇంతా కాదు. ప్రాథమిక విద్య నుంచి విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్య వరకూ నేడు విదేశాల్లో అడ్వాన్స్డ్ టెక్నాలజీగా రోబోటిక్స్‌కు వాడుతున్నారు. మనదేశంలో కూడా కొన్ని బడుల్లో అక్కడక్కడా పిల్లల కోసం ప్రవేశపెట్టబోతున్నారు. సాంకేతికంగా సెల్‌ఫోన్ వినియోగంపై పిల్లలకు బాగా అవగాహన ఉంటోంది. అందుకే పాఠశాలల్లో టెక్నికల్ బోధనకు ప్రాధాన్యత ఇస్తున్నామని అభివృద్ధి చెందుతున్న దేశాలు చెబుతున్నాయి. చెవులతో విన్న దానికంటే కళ్ళతో చూసిందే మనకు ఎప్పటికీ గుర్తుండి పోతుందని పేర్కొంటున్నాయి. మనదేశంలో రాస్ 2 సాఫ్ట్‌వేర్‌ను అరుదుగా ఉపయోగిస్తున్నారు. రోబో టెక్నాలజీలో ఇది ఆధునికం అనే చెప్పాలి. ఈ సాఫ్ట్‌వేర్‌తో పనిచేసే రోబోను ఎవరికి వాళ్ళ తీసుకెళ్లి వారు ఆన్ చేసి వాడుకోవచ్చు. అంటే క్యాటలాగ్ సాయంతో టీవీని ఎలాగైతే ఫిక్స్ చేసుకుంటామో అలాగే ఈ రోబోనే అమర్చుకోవచ్చు. ఇవి హోటళ్లల్లో సర్వ్ చేయటానికి కూడా ఉపయోగపడుతుంటాయి. బిల్‌కౌంటర్ లోనూ పనిచేస్తాయి. నాణ్యమైన విత్తనాలను గుర్తిస్తాయి. పాఠాలు చెప్పేస్తుంటాయి. అవసరాలకు అనుగుణంగా అందుకు తగ్గ డేటాలో వాళ్ల అవసరాలకు తగ్గట్టుగా రోబోలను తయారుచేసే కంపెనీలు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి వచ్చాయి. వీటికి రిమోట్ అవసరం లేదు. ముందుగానే ఇన్‌స్ట్రక్షన్ ఫీడ్‌చేసి ప్రోగ్రామింగ్ ఇస్తే చాలు. అవే తు.చ.తప్పకుండా చేసుకుపోతాయి.

### నైపుణ్యాలను పరీక్షించేలా...



విద్యార్థుల పాఠాలు బోధించటమే కాదు... వారి నైపుణ్యాలను పర్యవేక్షించి... ప్రిన్సిపాళ్లకు నివేదికలు అందజేసే రోబోలు కూడా మనదేశంలోని ప్రధాన నగరాల్లో అందుబాటులోకి వచ్చాయి. సరిగ్గా పోగ్రామింగ్ చేస్తే మనం ఇచ్చిన లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తాయి. ఇది ఆచరణలో కూడా రుజువైంది. ఏఐతో పనిచేసే రోబో లేదా డ్రోన్...ఏదైనా దానిపై మనకు పూర్తి అవగాహన ఉండాలి. అప్పుడే దానిని చక్కగా వాడుకోగలం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో పనిని సులభతరం చేసుకుంటూ ముందుకెళ్లొచ్చు.


### పాఠాలు... భళా!

కేరళ తిరువనంతపురంలోని కేటీసిటి స్కూలులో ఏఐ టీచర్ 'ఐరిస్' సంప్రదాయ చీరకట్టులో అచ్చం మహిళ గొంతుకతో పాఠాలు బోధిస్తున్నారు. కర్నాటక రాజధాని బెంగుళూరు నగరంలోని మల్లేశ్వరం ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలో 2022 నుంచి మార్చి 24 నుంచి చిట్టి 'ఈగల్' రోబో పిల్లలకు పాఠాలు చెబుతోంది. బెంగళూరులో ఇండస్ ఇంటర్నేషనల్ స్కూలులో రోబో టీచర్ శిక్షా ఫిజిక్స్, మ్యాథ్స్, కెమెస్ట్రీ సబ్జెక్టులను బోధిస్తున్నారు. చక్కగా యూనిఫాం వేసుకొని, మెడలో ఐడితో ఈ చిట్టి టీచరమ్మ హ్యూమనాయిడ్ రోబో. అసోంలోని గౌహతిలోని ఓ ప్రయివేటు స్కూలులో రోబో టీచర్ బోధిస్తోంది. ముంబైలోని కేంద్రీయ విద్యాలయ కంప్యూటర్ సైన్స్ టీచర్ దినేష్ పటేల్ పూర్తిగా వ్యర్థ పదార్థాలు, పారేసిన ప్లాస్టిక్, కార్డ్‌బోర్డ్, చెక్క, అల్యూమినియం భాగాలతో తయారుచేసిన రోబో ఏకంగా 38 భాషల్లో మాట్లాడేస్తోంది.

### విదేశాల్లో ఇలా ...

చైనా, జపాన్, అమెరికా, బ్రిటన్, రష్యా, కెనడా, ఆస్ట్రేలియా ఇలా ప్రపంచంలోని పలు దేశాల్లోని విద్యావిధానంలో రోబోటిక్స్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీని వాడుతున్నారు.

## ఉచితంగానే ఇన్నోవేషన్ టెక్నాలజీ



ఆంధ్రా, తెలంగాణాలోని విద్యాలయాల్లో రోబోటిక్స్ బూట్‌క్యాంప్‌ల ద్వారా పరిచయం చేస్తున్నా. రోబోటిక్స్ శాస్త్రం విద్యార్థులను నూతన టెక్నాలజీలకు దగ్గర చేస్తుంది, ఇవి భవిష్యత్తు ఉద్యోగాలపై ప్రభావం చూపే అవకాశముంది. రోబోటిక్స్ మోడళ్లు నిర్మించడంలో సమస్యలను గుర్తించడం, వాటికి పరిష్కారాలను కనుగొనడం వంటి పద్ధతులు, వారి ఆలోచనా శక్తిని అభివృద్ధి చేస్తాయి. ఈ బూట్‌క్యాంప్‌లు కొత్తగా అధ్యయనం చేసే అవకాశాలను అందించడంలో సహాయపడతాయి, అది పరిశోధనాపరమైన దృష్టికోణాన్ని పెంపొందిస్తుంది. సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్ (స్టెమ్)లో ప్రోత్సాహం రోబోటిక్స్ ద్వారా విద్యార్థులు ఆసక్తి పెంపొందించు కుంటారు. క్రియేటివిటీ, ఆవిష్కరణతో కూడిన ప్రాజెక్టులు తయారుచేస్తారు. బృందంగా పనిచేయటం, సమన్వయం సాధించటం వంటి మంచి నైపుణ్యాలను పెంచుకుంటారు. భవిష్యత్ కెరీర్‌కు ప్రాథమిక వేదికగా రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆటోమేషన్ వంటి రంగాల్లో విద్యార్థులకు ప్రాథమిక అవగాహన ఇస్తుంది.


**అభ్యాస నైపుణ్యాలు పెరుగుతాయి!**

సాంకేతిక ఉపకరణాలను ఉపయోగించుకొని, ఆచరణాత్మక అభ్యాసం చేయడం ద్వారా విద్యార్థులు బోధన వ్యవస్థను కొత్త స్థాయికి తీసుకెళ్లగలరు. భవిష్యత్తులో ఆవిష్కరణలకు దారి తీసే మార్గాన్ని ఏర్పర్చగల సామర్థ్యాన్ని విద్యార్థులు పొందుతారు. కోడింగ్, ప్రోగ్రామింగ్, మెకానికల్ డిజైన్ వంటి అంశాల్లో అవగాహన పెంపొందుతుంది.

రోబోటిక్స్ బూట్‌క్యాంప్‌లు పాఠశాల స్థాయిలోనే విద్యార్థుల భవిష్యత్‌ను మెరుగుపరచే పునాది వేస్తాయి. ఈ శిక్షణల ద్వారా విద్యార్థులు ప్రాజెక్ట్-ఆధారిత అభ్యాసానికి అలవాటు పడతారు, భవిష్యత్ ప్రపంచానికి తగిన నైపుణ్యాలను అభివద్ధి చేసుకుంటారు. ఆసక్తి గల పాఠశాలల యాజమాన్యాలు సొంతంగా ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేసుకుని మమ్మల్ని సంప్రదిస్తే ఐదు నుంచి తొమ్మిది తరగతుల విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తాం.

**- నరేంద్ర దాసరి, రోబోటిక్స్ నిపుణులు,**
**గురజాల, పల్నాడు జిల్లా.**
**76710 54796**

## రంగవల్లి



28 చుక్కలు 2 వరుసలు 2 వచ్చే వరకు (సరి చుక్క)



**కె.విజయలక్ష్మి,**
**కర్నూల్ జిల్లా,**
**ఆదోని.**

**మా చిరునామా**
మెయిల్ ఐడి : jeevana-pageps@gmail.com
వాట్సాప్ : 83329 25496

# కొత్త సంవత్సరంలో కొత్త సినిమాలు










పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ సినీ హీరోలు అల్లు అర్జున్, ఎన్‌టిఆర్, ప్రభాస్, మహేష్‌బాబు తదితరులు ప్రేక్షకులకు శుభాకాంక్షలు తెలిపారు. తమ కొత్త సినిమాల విశేషాలతో కూడిన పోస్టర్లను సోషల్‌మీడియా వేదికగా పంచుకుంటున్నారు. కొత్త ఏడాది భారతీయ సినిమా వైభవం మరింత ప్రకాశించాలని కోరుకుంటూ చిరంజీవి శుభాకాంక్షలు తెలిపారు. 'విశ్వంభర' సినిమాలో ఆయన నటిస్తున్నారు. వేసవి కానుకగా ఈ సినిమా విడుదల కానుంది. రామ్‌చరణ్-శంకర్ కాంబినేషన్‌లో రూపొందించిన 'గేమ్‌ఛేంజర్' ట్రైలర్‌ను గురువారంనాడు విడుదల చేయనున్నట్లుగా మైత్రీ మూవీ మేకర్లు ప్రకటించారు. సంక్రాంతి కానుకగా ఈ సినిమా ఈనెల 10న విడుదల కానుంది. తాను నటిస్తున్న 'హరిహర వీరమల్లు' సినిమా పోస్టర్‌తో పవన్ కళ్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. మార్చి 28న ఈ సినిమా విడుదల కానుంది. కథానాయకుడిగా నందమూరి బాలకృష్ణ నటించిన 'డాకు మహారాజ్' సినిమా ఈనెల 12న విడుదల కానుంది. వెంకటేశ్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా ఈనెల 14న విడుదల కానుంది. మేకర్లు విడుదల చేసిన కొత్త పోస్టర్ బాగా ఆకట్టుకుంటోంది. కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం ప్రవీణ్ కాండ్రేగుల, పి.వి.శ్రీనివాసులు నిర్మాతగా తెరకెక్కుతున్న చిత్రం 'పరదా'. ఈ సినిమా పోస్టర్ కూడా విడుదలయ్యింది. తెలుసుకదా, 7/జి.బృందావన కాలనీ 2, శిశిరం, ఓ చెలియా...తదితర చిత్రాల పోస్టర్లు కూడా ఆకర్షణీయంగా ఉన్నాయి.

## 3న 'దిల్‌రూబ' టీజర్

కిరణ్ అబ్బవరం నటిస్తున్న తాజా చిత్రం 'దిల్‌రూబా'. విశ్వ కరుణ్ ఈ సినిమాని తెర కెక్కిస్తున్నారు. హీరోయిన్ రుక్సర్ థిల్లాన్ ఈ చిత్రంతో టాలీవుడ్ ఇండస్ట్రీకి పరిచయం కాబో తుంది. ఈ చిత్రాన్ని శివమ్ సెల్యులాయిడ్స్ అండ్ సారెగమ నిర్మాణ సంస్థ 'ఏ యాడ్లీ ఫిల్మ్' సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ సినిమా ఫిబ్రవరిలో థియేటర్స్‌లో విడుదల కానుంది. తాజాగా, నూతన సంవత్సరం సందర్భంగా 'దిల్‌రూబా' మూవీ టీజర్ జనవరి 3న విడుదల కాబోతున్నట్లు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా కిరణ్ ప్రకటించారు. హీరోయిన్‌తో బీచ్‌లో సైకిల్ మీద చెట్టాపట్టా లేసుకుని తిరుగుతున్న పోస్టర్‌ను కూడా షేర్ చేశాడు.







## 'మన సాగర్ గాడి లవ్వు... మహాలక్ష్మి' ఫస్ట్‌లుక్ విడుదల

రామ్ పోతినేని, భాగ్యశ్రీ బోర్సే జంటగా కొత్త సినిమా తెరకెక్కుతోంది. మహేష్‌బాబు పి. దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీమూవీస్ మేకర్లు నిర్మిస్తున్నారు. రామ్ కెరీర్‌లో ఇది 22వ సినిమా. ఈ చిత్రంలో సాగర్ పాత్రలో రామ్ పోతినేని నటిస్తున్నారు. ఆయన క్యారెక్టర్ లుక్‌ను ఇటీవల విడుదల చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం నాడు కథానాయిక భాగ్యశ్రీ బోర్సే ఫస్ట్‌లుక్‌ను మేకర్లు విడుదల చేశారు. సంగీతం వివేక్ మెర్విన్, ఎడిటర్ శ్రీకర్‌ప్రసాద్. ఇప్పటికే ఈ సినిమా ఫస్ట్ షెడ్యూల్ షూటింగ్ పూర్తయ్యింది. సెకండ్ షెడ్యూల్ ప్రయత్నాల్లో మేకర్లు ఉన్నారు.

## అసిస్టెంట్ సినిమాటోగ్రాఫర్ మృతి

నటుడు నాని 'హిట్ 3' మూవీ షూటింగ్ జమ్మూకాశ్మీర్ శ్రీనగర్‌లో షూటింగ్‌లో జరుగుతోంది. అకస్మాత్తుగా గుండెపోటు రావటంతో అసిస్టెంట్ సినిమాటోగ్రాఫర్ కెఆర్ కృష్ణ (30) మృతి చెందారు. హిట్ సిరీస్‌లో వస్తున్న మూడో భాగమే హిట్ : ది థర్డ్ కేస్. శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో నాని అర్జున్ సర్కార్‌గా పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. శ్రీనిధి శెట్టి కథానాయిక. యునానిమస్ ప్రొడక్షన్స్‌తో కలిసి ప్రశాంతి త్రిపురనేని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శ్రీనగర్‌లో కొనసాగుతోంది. మిక్కీ జేమేయర్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా మే 1న విడుదల కానుంది.

# 2025లో టీమిండియా బిజీ.. బిజీ..

## ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు ఇంగ్లండ్‌తో సిరీస్..

**ముంబయి:** 2025 ఏడాదిలో టీమిండియా బిజీ.. బిజీ.. షెడ్యూల్‌తో గడపనుంది. ఫిబ్రవరిలో పాకిస్తాన్ వేదికగా జరిగే ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు టీమిండియా జట్టు స్వదేశంలో జనవరి 22నుంచి ఇంగ్లండ్‌తో వన్డే, టి20 సిరీస్‌లకు సిద్ధమైంది. ఈ ఏడాది ఛాంపియన్స్ ట్రోఫీ వన్డే ఫార్మాట్‌లో జరగనున్న దృష్ట్యా ఇంగ్లండ్‌తోనూ మూడు వన్డేల సిరీస్‌ను భారత్ సిద్ధం చేసింది. ఈ షెడ్యూల్‌కు ఇరుదేశాల క్రికెట్‌బోర్డులు ఇప్పటికే అంగీకారం తెలిపాయి. ఆ తర్వాత టీమిండియా ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యుటిసి) ఫైనల్‌కు అర్హత సాధిస్తే.. అది జూన్‌లో లార్డ్స్ వేదికగా ఉంటుంది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా బాక్సింగ్ డే టెస్ట్‌లో ఓడిన టీమిండియా.. 11ఏళ్ల తర్వాత ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యుటిసి) ఫైనల్‌కు మరోసారి చేరే ఛాన్స్‌ను కోల్పోయే ప్రమాదంలో పడింది. ఈ క్రమంలోనే దక్షిణాఫ్రికా జట్టు డబ్ల్యుటిసి ఫైనల్స్‌కు ఇప్పటికే అర్హత సాధించగా.. రెండో బెర్త్ కోసం ఆస్ట్రేలియా, భారత్, శ్రీలంక జట్లు రేసులో ఉన్నాయి. సిడ్నీ వేదికగా జనవరి 3 నుంచి ఆస్ట్రేలియాతో ఐదో, చివరి టెస్ట్‌లో భారత్ ఆడనుంది. ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ ఆడే మ్యాచ్‌లన్నీ దుబాయ్ వేదికగా జరగనున్నాయి. పాకిస్తాన్ ఆతిథ్యమిచ్చే ఈ టోర్నీలో టీమిండియా ఒకవేళ నాకౌట్‌కు చేరితే ఆ మ్యాచ్‌లు కూడా దుబాయ్‌లోనే ఉంటాయి. ఛాంపియన్స్ ట్రోఫీ ముగిసిన పిమ్మట భారత్ వేదికగా ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్ మార్చి 14నుంచి ప్రారంభం కానుంది. ఆ తర్వాత టీమిండియా జూన్-ఆగస్ట్‌లో ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ ఆడేందుకు వెళ్లాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఆగస్టులో బంగ్లాదేశ్‌తో మూడు టిలు, మరో మూడు వన్డేల్లో.. అక్టోబర్ 25నుంచి స్వదేశంలో వెస్టిండీస్‌తో రెండు టెస్ట్ మ్యాచ్‌ల ఆడాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లి డిసెంబర్‌లో దక్షిణాఫ్రికాతో స్వదేశంలో మూడు ఫార్మాట్‌లలోనూ తలపడాల్సి ఉంది. దీంతో ఈ ఏడాది భారత్ ఐసిసి సభ్యత్వ దేశాలతో బిజీ.. బిజీ.. షెడ్యూల్‌తో గడపనుంది.



ఆస్ట్రేలియా ప్రధాని నివాసంలో నూతన సంవత్సర వేడుకలకు హాజరైన టీమిండియా ఆటగాళ్లు

**ఇంగ్లండ్‌తో సిరీస్..**

**టి20 సిరీస్...**

| | |
|---|---|
| జనవరి 22 | : తొలి టి20(చెన్నై) |
| జనవరి 25 | : రెండో టి20(కోల్‌కతా) |
| జనవరి 28 | : మూడో టి20(రాజ్‌కోట్) |
| జనవరి 31 | : నాల్గో టి20(పూణే) |
| ఫిబ్రవరి 2 | : ఐదో టి20(ముంబయి) |

**వన్డేలు..**

| | |
|---|---|
| ఫిబ్రవరి 6 | : తొలి వన్డే(నాగ్‌పూర్) |
| ఫిబ్రవరి 9 | : రెండో వన్డే(కటక్) |
| ఫిబ్రవరి 12 | : మూడో వన్డే(అహ్మదాబాద్) |

**ఛాంపియన్స్ ట్రోఫీ :** ఫిబ్రవరి - మార్చి
**ఐపిఎల్ :** మార్చి 14నుంచి మే 25వరకు
**ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్స్:** జూన్ 2025(భారత్ అర్హత సాధిస్తేనే..)


**ఇండియా × ఇంగ్లండ్ : జూన్-ఆగస్టు (5టెస్టులు)**

| | |
|---|---|
| తొలి టెస్ట్ | : జూన్ 20-24(హెడ్డింగ్లీ) |
| రెండో టెస్ట్ | : జులై 2-6(ఎడ్జ్‌బాస్టన్) |
| మూడో టెస్ట్ | : జులై 10-14(లార్డ్స్) |
| నాల్గో టెస్ట్ | : జులై 23-27(మాంచెస్టర్) |
| ఐదో టెస్ట్ | : జులై 31-ఆగస్టు4(ఓవల్) |

**ఆగస్టు :** టీమిండియా బంగ్లా పర్యటన (3వన్డేలు, 3టి20లు)
**అక్టోబర్ :**విండీస్ ఇండియా పర్యటన (2టెస్టులు)
**అక్టోబర్-నవంబర్ :** భారత్ వేదికగా ఆసియాకప్(టి20)
**నవంబర్ :** భారతజట్టు ఆస్ట్రేలియా పర్యటన(3వన్డేలు, 5టి20లు)
**నవంబర్-డిసెంబర్:** దక్షిణాఫ్రికా జట్టు భారత పర్యటన(2టెస్టులు, 3వన్డేలు, 3టి20లు)

## వైశాలికి కాంస్యం

**బ్లిట్జ్ మహిళల ఛాంపియన్‌షిప్**



**న్యూయార్క్:** బ్లిట్జ్ మహిళల ఛాంపియన్‌షిప్‌లో భారత యువ గ్రాండ్‌మాస్టర్ రమేశ్‌బాబు వైశాలి కాంస్య పతకంతో మెరిసింది. ఈ టోర్నీలో అద్భుత ప్రదర్శనతో నాకౌట్‌కు చేరిన వైశాలి.. అదే ప్రదర్శనను పతకం చేజిక్కించుకోవడంలో ప్రదర్శించింది. క్వార్టర్‌ఫైనల్లో వైశాలి 2.5-1.5పాయింట్లతో చైనాకు చెందిన జూ జినెర్‌ను చిత్తుచేసింది. ఇక సెమీస్‌లో జూ వెన్‌జున్(చైనా) చేతిలో 0.5-2.5పాయింట్లతో ఓటమిపాలైంది. ఫైనల్లో లీ-టింగ్‌జీతో తలపడిన వెన్ జున్ 3.5-2.5పాయింట్ల తేడాతో గెలిచి విజేతగా నిలిచింది. సెమీస్‌లో ఓడిన ఇరువురు గ్రాండ్‌మాస్టర్లకు కాంస్య పతకాలు దక్కాయి. కాంస్య పతకం నెగ్గిన వైశాలికి విజేతలకు ఐదుసార్లు ప్రపంచ ఛాంపియన్, అంతర్జాతీయ చెస్ ఫెడరేషన్(ఫిడే) ఉపాధ్యక్షులు విశ్వనాథన్ ఆనంద్ శుభాకాంక్షలు తెలిపారు. 'కాంస్యం నెగ్గిన వైశాలికి అభినందనలు. ఆమె ఈ టోర్నీలో అద్భుత ప్రదర్శనతో రాణించడం గర్వకారణం' అని ట్విటర్(ఎక్స్)లో విశ్వనాథన్ ఆనంద్ పేర్కొన్నారు. 2021 నుంచి 2024 వరకు చెస్‌లో అద్భుత ఫలితాలను సాధించామని, ఈ ఏడాది చివర్లో హంపి, వైశాలి సాధించిన పతకాలే ఇందుకు నిదర్శనమని విశ్వనాథన్ ఆనంద్ తెలిపారు. ఇక ర్యాపిడ్ విభాగంలో కోనేరు హంపి విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే.

## రేపటినుంచి సిడ్నీ టెస్ట్

### ఆరుగురు స్పెషలిస్ట్ బ్యాటర్లతో టీమిండియా..!

**సిడ్నీ:** బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో 1-2 తేడాతో వెనుకబడ్డ టీమిండియా.. జనవరి 3 నుంచి సిడ్నీ వేదికగా చివరి టెస్ట్‌కు సిద్ధమైంది. చివరి టెస్ట్‌లో కాంబినేషన్ టీమిండియాకు సవాల్‌గా మారనుంది. ఓపెనర్ శుభ్‌మన్ గిల్ నాలుగో టెస్ట్‌కు దూరం కాగా.. ఐదో టెస్టుకు ఆరుగురు స్పెషలిస్ట్ బ్యాట్స్‌మెన్స్‌తో బరిలోకి దిగాలని జట్టు మేనేజ్‌మెంట్ భావిస్తోంది. నాలుగో టెస్టులో ఓటమి తర్వాత టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ విమర్శలు ఎదుర్కొన్నాడు. ప్లేయింగ్-11 నుంచి గిల్‌ను తప్పించడంపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. బోర్డర్ -గవాస్కర్ ట్రోఫీని టీమిండియా నిలబెట్టుకోవడంతో పాటు ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్(డబ్ల్యుటిసి) ఫైనల్ రేసులో నిలవాలంటే.. రోహిత్ జట్టుకు బెస్ట్ ఆప్షన్స్‌ను ఎంచుకోవాల్సి ఉంటుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. భారత కెప్టెన్ సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో తన ఆరుగురు అత్యుత్తమ బ్యాట్స్‌మెన్స్‌ను రంగంలోకి దించాల్సిందేనని చెబుతున్నారు. ఇదే జరిగితే మెల్‌బోర్న్ టెస్టుకు దూరమైన శుభ్‌మన్ గిల్‌కు సిడ్నీ టెస్ట్ తుది జట్టులో చోటు దక్కేందుకు మార్గం సుగమం అయినట్లే..!


Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68